J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 5 8.7.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# ఉద్యమ స్ఫూర్తికి.. అజరామర కీర్తి

## మన్యం వీరుడి మహోన్నత దీప్తి





**• ప్రధాని మోడీ చేతులమీదుగా 30 అడుగుల కాంస్య విగ్రహం ఆవిష్కరణ**

*'అజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా జులై 4న మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి రోజున రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు నిర్వహించడం, శ్రీ అల్లూరి సీతారామరాజు జిల్లా (పశ్చిమ గోదావరి జిల్లా)లోని భీమవరంలో ఆ విప్లవవీరుని 30 అడుగుల కాంస్య విగ్రహాన్ని భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆవిష్కరించడం అపూర్వం.. చరిత్రాత్మకం. కుడిచేతిలో బాణం, ఎడమచేతిలో విల్లు పట్టుకుని నిలుచున్న అల్లూరి భారీ విగ్రహం దేశంలోనే అతిపెద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహంగా పేరొందనుందని భావిస్తున్నారు. ఈ సందర్భంగా అక్కడికి సమీపంలోనే ఉన్న కాళ్ళ మండలం పెద అమిరం గ్రామంలో పెద్దఎత్తున జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ అల్లూరి వీరత్వం గురించి సుదీర్ఘంగా ప్రసంగించడం విశేషం.*

## యుగపురుషుడు

*'స్వాతంత్ర్యం నా జన్మహక్కు' అంటూ తెల్లదొరలను గడగడలాడిస్తూ తెలుగుగడ్డపై విప్లవశంఖారావం పూరించిన వీరుడు అల్లూరి సీతారామరాజు. చేతిలో విల్లంబులు ధరించి పరమ కర్కశులైన బ్రిటిష్‌పాలకుల తుపాకులకు ఎదురొడ్డి పోరాడిన ధీరుడు..అల్లూరి సీతారామరాజు. తాను మరణించినా వేలాదిమంది వీరులు పుట్టుకొస్తారని గొంతెత్తి చాటిన మొనగాడు అల్లూరి సీతారామరాజు. భరతమాత విముక్తి కోసం ప్రాణాలనే పణంగా అర్పించిన త్యాగధనుడు.. అల్లూరి సీతారామరాజు. తెలుగుజాతి తెగువకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన యుగపురుషుడు అల్లూరి. ఆ మహనీయునికివే వేనవేల జోహార్లు!....*

10లో

### తెలుగు వీర లేవరా!.. దీక్షబూని సాగరా!...

**'తెలుగు వీర లేవరా.. దీక్షబూని సాగరా'** అంటూ స్వాతంత్ర్య సంగ్రామంలో యావత్ భారతావనికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన నాయకుడు అల్లూరి సీతారామరాజు పుట్టిన నేలపై మనమందరం కలుసుకోవడం మన అదృష్టం' అంటూ ప్రధాని మోడీ తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించ డంతో కరతాళధ్వనులు మిన్నుముట్టాయి. స్వయంగా ప్రధానే వచ్చి అల్లూరి విగ్రహాన్ని ఆవిష్కరించడంతో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు యావత్ భారత దేశమంతటా అల్లూరి సీతారామరాజు పేరు మార్మోగిపోయింది. సభా ప్రాంగణమంతా అల్లూరికి జోహార్లర్పిస్తూ జయజయధ్వానాలతో దద్దరిల్లి పోయింది. మన్యం వీరునికి సముచిత సత్కారం లభించినట్లయింది. దీంతో తెలుగు ప్రజల హృదయాలు పులకించిపోయాయి.

### ఆంధ్రరాష్ట్రం..పుణ్యభూమి :

'యుగపురుషుడు..అల్లూరి' అంటూ ప్రధాని మోడీ ఈ సందర్భంగా కొనియాడారు. బ్రిటిష్ పాలకుల్ని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు దేశంలోని కోట్లాదిమంది ఆదివాసీల ధైర్యానికి, స్థైర్యానికి ప్రతీకగా నిలిచారన్నారు. 'దమ్ముంటే నన్ను ఆపండి' అంటూ గర్జించి బ్రిటిష్ సైనికుల తుపాకులకు ఎదురొడ్డి నిలిచిన ఆ మహావీరుడి ధైర్యసాహసాలే స్ఫూర్తిగా ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న అనేక సవాళ్ళపై 130కోట్ల మంది ప్రజలు ఐకమత్యంగా పోరాడాలంటూ' ప్రధాని ఉద్వేగంతో పిలుపునిచ్చారు. యావత్ భారతజాతిని ఒక్కత్రాటిపై నిలుపుతున్న 'ఒకే భారత్..శ్రేష్ఠ భారత్' అనే భావనకు అల్లూరి అసలైన ప్రతీకని ఆయన ప్రశంసల వర్షం కురిపించారు.

"ఆంధ్ర రాష్ట్రం పుణ్యభూమి. ఇక్కడికి రావడం నా అదృష్టం. ఈ వీర భూమికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. సీతారామరాజు జయంత్యుత్సవాల సందర్భంగా యావత్ భారతదేశం తరపున ఆయనకు పాదాభివందనం చేస్తున్నా" నంటూ ప్రధాని ఆ వీరునికి జేజేలు పలికారు.

ఆంధ్రప్రదేశ్ ఎందరో దేశభక్తులకు పురిటిగడ్డ అని, జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య, కన్నెగంటి హనుమంతు,

10లో

# వై.యస్. అంటే ఒక భరోసా..! ఓ నమ్మకం..!!

12లో



73వ
జయంతి

రాజన్న

ఈ ధరిత్రి మరువని ప్రస్థానం మీది...
మా మదిలో చెరగని స్థానం మీది!

మీ పుట్టినరోజు (జులై 08)
తెలుగు జాతికి పండుగరోజు.

వై.యస్. సేవాసమితి
నెల్లూరు.

# కాలువలో పడిపోయిన పుస్తకాల వ్యాన్

## • తడిసిపోయిన 'జగనన్న విద్యాకానుక' సామగ్రి





జగన్న విద్యాకానుకకు సంబంధించిన విద్యాసామగ్రిని తీసుకువస్తున్న ఓ వ్యాన్ బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని అన్నారెడ్డిపాళెం వద్ద అదుపుతప్పి కనిగిరి రిజర్వాయర్ సదరన్ చానల్ వద్ద కాలువలోకి బోల్తాకొట్టింది. ఈనెల 3న నెల్లూరు సర్వశిక్ష అభియాన్ కార్యాలయం నుంచి కలిగిరి, వింజమూరు, దుత్తలూరు తదితర మండలాల్లోని పాఠశాలలకు చెందిన విద్యాసామగ్రిని తీసుకువెళ్తున్న ఆ వ్యాన్ కాలువలో పడిపోవడంతో వ్యాన్‌లోని బ్యాగులు, నిఘంటువులు (డిక్షనరీలు) పాక్షికంగా తడిసిపోయాయి. వ్యాన్‌లో ఉన్న డ్రైవర్‌తోపాటు మరోవ్యక్తి సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, విద్యాశాఖ అధికారులు సంఘటనాస్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో వ్యాన్‌ను బయటకు తీయించారు. సర్వశిక్ష అభియాన్ అడిషనల్ కో-ఆర్డినేటర్ ఉషారాణి వెళ్ళి సంఘటన వివరాలను తెలుసుకున్నారు. వ్యాన్‌లో అయిదు మండలాలకు చెందిన విద్యాసామగ్రి కిట్లు ఉన్నాయని, వాటిని పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు. సిఏంఓ భాస్కర్‌రెడ్డి, ఎంఇఓ దిలీప్‌కుమార్, సిఆర్‌పి మల్లీశ్వర్‌రెడ్డి తదితరులు పుస్తకాలను పరిశీలించారు.

# రాష్ట్రస్థాయి చెస్‌లో.. సత్తాచాటిన హిమ తేజస్విని



ఇటీవల అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 చెస్‌పోటీల్లో నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన గొట్టేటి హిమ తేజస్విని ఎంతో ప్రతిభతో రాణించి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. దీంతో ఆమె త్వరలో మహారాష్ట్రలోని పూనేలో జరిగే జాతీయస్థాయి మహిళల చెస్ పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు కోచ్ ప్రదీప్ తెలిపారు. జిల్లాలో రాష్ట్రస్థాయిలో అండర్-19 విభాగంలో ఛాంపియన్‌షిప్‌ను సాధించిన తొలి క్రీడాకారిణి హిమ తేజస్విని కావడం గర్వకారణమంటూ బుచ్చిరెడ్డిపాళెంలో ఈనెల 3న జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కెవివి శర్మ, కార్యదర్శి భీమారావు, కోశాధికారి జ్వాలాముఖి హిమ తేజస్వినిని అభినందించారు. ఏపి చెస్ అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ పి.మస్తాన్‌బాబు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న 'కళాదీప్తి' నృత్యాలు





నెల్లూరులోని కళాదీప్తి డాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈనెల 3న నెల్లూరు టౌన్‌హాల్‌లో కళాదీప్తి 17వ సమ్మర్ డాన్స్ సెలబ్రేషన్స్ వేడుకగా జరిగాయి. కళాదీప్తి నృత్యకళాకారులు కరిముల్లా, విద్యాధరి, వైష్ణవి తదితరులతో పాటు చిన్నారులు తన్మయ్, లాస్యప్రియ, భవ్యహాసిని, కావ్యశ్రీ, రాము, సాయిరిషిక్, శ్రీనిధి, వేద అక్షయ, పర్ణిక, హనీష, రిషిత, నిత్య తదితరులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రత్యేకించి ప్రముఖ నృత్యకళాకారుడు కరిముల్లా ప్రదర్శించిన 'జన్మ నీదేలే', 'అమ్మా అని పిలిచినా' తదితర సినీపాటలకు నృత్యాలు, చిరంజీవి పాటలకు డాన్స్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 'వేయి నామాలవాడ వేంకటేశుడా'..అంటూ విద్యాధరి నృత్యాలు, 'నెమలికి నేర్పిన నడకలివీ'..అంటూ వైష్ణవి నృత్యం, శ్రీ వేంకటేశ్వరునిగా 'రాము'తో పాటు చిన్నారుల నృత్యాలన్నీ దేనికవే ప్రత్యేకతగా నిలిచాయి. కళాదీప్తి నిర్వాహకుడు ఇకె సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బిజెపి సీనియర్ నాయకులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి జ్యోతిప్రజ్వలన చేయగా, మోడరన్ స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. నేషనల్ హైవేస్ డి.ఇ పి.అనిల్‌కుమార్‌రెడ్డి, డా.మల్లెల శ్రీహరి, శారదామణి సుబ్రహ్మణ్యం, పి.పద్మజారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, 'లాయర్' వారపత్రిక సబ్‌ఎడిటర్ మద్దూర్డు శ్రీనివాసులు, ప్రముఖ నాట్యాచార్యులు రమణయ్య, కరాటే మాస్టర్ మధుసూదన్‌రెడ్డిలను ఆత్మీయంగా సన్మానించి జ్ఞాపికలు బహుకరించారు.

### జొన్నవాడ కామాక్షమ్మకు..

# కుంకుమపూజలు



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో కొలువైవున్న శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి సన్నిధిలో ఇటీవల సామూహిక కుంకుమార్చన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారిని పూలమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత కామాక్షితాయి అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.



# అంకమ్మ తల్లికి పొంగళ్ళు

కొండాపురం మండలంలోని మర్రిగుంట్ల గ్రామంలో వెలసివున్న శ్రీ అంకమ్మ అమ్మవారికి ఈనెల 3న గ్రామస్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. మహిళా భక్తులు పొంగళ్ళు పెట్టి మేళతాళాలతో అంకమ్మ గుడి వద్దకు ఊరేగింపుగా వెళ్ళి అమ్మవారికి నైవేద్యం సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు ఈ సందర్భంగా అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

# ఆర్టీసీ డిపో మేనేజర్ల బదిలీ

ఆర్టీసి నెల్లూరు రీజియన్‌లో పలువురు డిపో మేనేజర్ల (డిఎం)ను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఇటీవల ఆదేశాలు జారీచేశారు. కావలిలో పనిచేస్తున్న హరిని కడపకు, విజయవాడ డిఎం ఆర్ శ్రీనివాసులును కావలికి బదిలీ చేశారు. అదే విధంగా బాపట్ల డిఎం కేపి శెట్టిని కందుకూరుకు, కందుకూరు డిఎం శ్రీమన్నారాయణను ప్రకాశం జిల్లా కనిగిరికి బదిలీ చేశారు. ఉదయగిరి డిపో మేనేజర్ ప్రతాప్‌కుమార్ ఇటీవల మృతిచెందడంతో ఒంగోలు డిఎంగా పనిచేస్తున్న శ్రీనివాసరావును ఉదయగిరి డిఎంగా నియమించారు.

# సహకార సిబ్బంది కార్యవర్గం

జిల్లా సహకార సంఘాల సిబ్బంది అసోసియేషన్‌కు ఈనెల 3న కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నెల్లూరులోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘానికి గౌరవాధ్యక్షునిగా బత్తిన శ్రీధర్‌రెడ్డి, అధ్యక్షునిగా తంగిశెట్టి నాగరాజు, కార్యనిర్వాహక అధ్యక్షునిగా రాధయ్య, ఉపాధ్యక్షులుగా సురేష్‌రెడ్డి, పోలయ్య, రాజశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రవీంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా రాధాకృష్ణారెడ్డి, కార్యదర్శులుగా వంశీకృష్ణ, ఖాజామస్తాన్, సుబ్బారావు, రామ్‌సాయి, రమేష్‌రెడ్డి, న్యాయ సలహాదారుగా రమణమూర్తిలను ఎన్నుకున్నారు.

# మాలకొండ ఆలయానికి.. 9 కోట్లు

## - కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

నెల్లూరుజిల్లా కందుకూరు నియోజకవర్గంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మాలకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం అభివృద్ధికి ప్రభుత్వం 9 కోట్ల రూపాయలు మంజూరుచేసిందని, దీంతో త్వరలోనే ఆలయ అభివృద్ధి పనులు, ఆధునీకరణ పనులు నిర్వహించనున్నట్లు కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ఆయన మాలకొండ క్షేత్రం కొలువైవున్న వలేటివారిపాళెంలో విలేకర్లతో మాట్లాడుతూ కొండమీదకు వెళ్ళే మెట్లమార్గం ఆధునీకరణకు, కొండపైన కారుపార్కింగ్ వద్ద రిటర్నింగ్‌వాల్, క్యూ లైన్ ఆధునీకరణకు, కొండ దిగువన లడ్డూ తయారీ భవనానికి ప్రహరీ నిర్మాణం, సిసి రోడ్లు, మరుగుదొడ్ల నిర్మాణం వగైరాలకు ఈ మొత్తాన్ని వెచ్చించనున్నామని చెప్పారు.

# ట్రెజరీ డెప్యూటీ డైరెక్టర్‌గా..గంగాద్రి

జిల్లా ఖజానా (ట్రెజరీ) శాఖ డెప్యూటీ డైరెక్టర్‌గా చిత్తూరులో డి.డిగా పనిచేస్తున్న గంగాద్రి ఈనెల 4న నెల్లూరులో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటిదాకా నెల్లూరు డి.డిగా పనిచేస్తున్న రామచంద్రను చిత్తూరుకు మార్చారు. కొత్త డి.డికి ఏటిఓ లోకేష్‌బాబు, ట్రెజరీ ఉద్యోగుల సంఘం నాయకులు రమణారెడ్డి, కిరణ్, సుబ్రహ్మణ్యం, రెహమాన్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

# కందుకూరుకు కొత్త సిఐ



కందుకూరు సిఐగా గుంటూరు రేంజ్ కార్యాలయంలో పని చేస్తున్న జి.వెంకటరావును నియమించారు. డిఐజి త్రివిక్రమవర్మ తాజాగా ఆమేరకు ఆదేశాలిచ్చారు. కందుకూరు సిఐగా ఉన్న వి.శ్రీరామ్‌ను రేంజ్ కార్యాలయానికి మార్చారు. కొత్త సిఐ వెంకటరావు ఈనెల 4న నెల్లూరుకు వచ్చి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ విజయారావును కలుసుకున్నారు. 2004 బ్యాచ్‌కి చెందిన వెంకటరావు గతంలో జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో ఎస్ఐగా, నార్త్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్‌గా కూడా పనిచేసివున్నారు.

# గ్రంథాలయ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం.. 8న

జిల్లా గ్రంథాలయ సంస్థలో రిటైరైన ఉద్యోగుల సంఘం సమావేశం ఈనెల 8న నెల్లూరు గాంధీబొమ్మ కూడలి వద్దనున్న మహిళా గ్రంథాలయం ఆడిటోరియంలో జరుగుతుందని, రాష్ట్ర సంఘం అధ్యక్షులు పి.మల్లేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆ సంఘం జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.రంగారెడ్డి, ఎస్.పెంచలయ్య తెలిపారు. సమావేశంలో సంఘానికి నూతన కమిటీని ఎన్నుకుంటామని వారు పేర్కొన్నారు.

# పోరాటస్ఫూర్తి.. అల్లూరి



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తన పోరాటస్ఫూర్తితో నాటి బ్రిటీష్‌పాలకులను గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు జీవితం, వీరోచిత పోరాటాలు, ఆయన చేసిన త్యాగాలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. ఈనెల 3న అల్లూరి 125వ జయంతిని పురస్కరించుకుని నెల్లూరులోని గీతామయి బాలభవన్‌లో జరిగిన కార్యక్రమంలో స్థానిక పినాకిని వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు మాట్లాడుతూ తెల్లదొరల పాలన నుంచి దేశానికి విముక్తి కలిగించాలని అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం ఎంత గొప్పదో చిన్నారులకు వివరించారు. తొలుత అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయురాలు ఒరుగంటి అపర్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. అసోసియేషన్ సభ్యులు కె.భరత్‌కుమార్‌రాజు, కె.పవన్, జయవెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాలలకు మిఠాయిలు, తినుబండారాలు పంపిణీ చేశారు.

# పడారుపల్లి గంగమ్మకు.. ప్రత్యేక పూజలు

నెల్లూరు శివార్లలోని పడారుపల్లిలో వెలసివున్న శ్రీ గంగమ్మ దేవాలయంలో ఈనెల 3న ఆలయ అర్చకులు పెద్దఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల్లూరుజిల్లా లయన్స్‌క్లబ్ ఛైర్మెన్ ఏ.వెంకటసుబ్బయ్య పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆలయ కమిటీ సభ్యులు శాలువతో సత్కరించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. పడారుపల్లి గ్రామ రెవెన్యూ అధికారి కాకుటూరు శ్రీహరి, వేమిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, కాకు కామయ్య, గుమ్మ ప్రతాప్, నగళ్ళ బాబాజీ, కాకుటూరు మస్తానయ్య, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

# పరిశోధనలతోనే పురోగతి

## • తిరుపతిని రీసెర్చ్ కారిడార్‌గా చేద్దాం
## • డిఆర్‌డిఓ ఛైర్మెన్..మన సతీష్‌రెడ్డి



*దేశాన్ని శక్తివంతంగా తీర్చిదిద్దుకోవాలంటే అన్ని రంగాల్లోనూ అధునాతన పరిశోధనలు అవసరం. పరిశోధనలతోనే పురోగతి ఉంటుంది. అందుకే వాటిని ప్రోత్సహించే రీసెర్చ్ సంస్థలకు ప్రోత్సాహకాలను అందిస్తాం. విశ్వవిఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిని, పరిశోధనల పరంగా కూడా అగ్రగామిగా చేసేందుకు తిరుపతిని రీసెర్చ్ కారిడార్‌గా చేసుకుందామంటూ భారత రక్షణ పరిశోధన సంస్థ (డిఆర్‌డిఓ) ఛైర్మెన్, కేంద్ర ప్రభుత్వ రక్షణ పరిశోధన కార్యదర్శి, మన నెల్లూరీయుడు డాక్టర్ సతీష్‌రెడ్డి చెప్పారు. తిరుపతిలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించి శాస్త్ర సాంకేతికరంగాల్లోని యువ శాస్త్రవేత్తలకు స్ఫూర్తినిచ్చారు.*

దేశంలో ఏ నగరంలోనూ లేనివిధంగా 9 విశ్వవిద్యాలయాలున్న తిరుపతిని రీసెర్చ్ కారిడార్‌గా తీర్చిదిద్దుతామని డిఆర్‌డిఓ ఛైర్మెన్ డా.సతీష్‌రెడ్డి తెలిపారు. గత పదేళ్ళలో దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఊహించని పురోగతి సాధించిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తిరుపతిలో కొత్తగా ఏర్పాటుచేసిన ఐఎస్‌టిఎఫ్ (ఇన్నొవేషన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్)ను ఆయన ప్రారంభించి లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసెర్చ్ స్కాలర్లు, యువ శాస్త్రవేత్తలు సరికొత్త ఆవిష్కరణలతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వేలాదిమంది విద్యావేత్తలు, యువత ఉన్న తిరుపతిని పరిశోధనలకు వేదికగా రూపొందించేందుకు ఎంతో అవకాశం ఉందన్నారు. ఐఐటి పూర్తిచేసుకున్న విద్యార్థులు గతంలో విదేశాలకు వెళ్ళేవారని, ఇప్పుడు వారంతా దేశంలోనే ఉంటున్నారని, దాదాపు 70వేలకు పైగా కొత్త ఆవిష్కరణలు కేంద్ర ప్రభుత్వం వద్ద నమోదై ఉన్నాయని, ఇది మన పురోగతికి నిదర్శనమని తెలిపారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఇండెక్స్, టెక్నాలజీ డెవలప్‌మెంట్ ఫండ్ విభాగాల ద్వారా డిఆర్‌డిఓ కోటి రూపాయల నుంచి 15 కోట్ల వరకు నిధులు మంజూరు చేస్తుందని, ఇప్పటిదాకా 60 ఆవిష్కరణలకు ప్రోత్సాహక నిధులిచ్చామని, ఈ ఏడాది మరో 5వేల ఆవిష్కరణలను పెంచాలన్నది లక్ష్యమన్నారు. యువశాస్త్రవేత్తలు, పరిశోధనలపై ఆసక్తి కలిగినవారు ఆ నిధిని సద్వినియోగం చేసుకోవాలని, పరిశోధనలపై అవగాహన పెంపొందించేందుకు సరికొత్త వేదికగా ఈ ఫౌండేషన్ ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు పరిశోధక విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

# అల్లూరికి..నెల్లూరులో ఘననివాళి



మన్యం వీరుడు అల్లూరి సీతా రామరాజు 125వ జయంతిని పురస్కరించుకుని ఈనెల 4న నెల్లూరు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు తదితర అధికారులు ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అల్లూరి త్యాగశీలతను, పోరాటపటిమను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత సమాజాభివృద్ధి కోసం కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు దేశభక్తి ఆదర్శనీయమని ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటి డైరెక్టర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# 'వాహనమిత్ర' లబ్ధిదారులకు.. 13న నగదు

**- ఉప రవాణా కమిషనర్ చందర్**

వైఎస్సార్ వాహనమిత్ర లబ్ధిదారులకు 2022-23 సంవత్సరానికి ఆర్థికంగా చేయూతనందించేందుకు అర్హులైన ఆటోరిక్షా, టాక్సీ, మాక్సీక్యాబ్ వాహన యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం 10 వేల రూపాయల వంతున అందించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని నెల్లూరుజిల్లా ఉప రవాణా కమిషనర్ బి.చందర్ ఈనెల 6న ఒక ప్రకటనలో తెలియజేశారు. జులై 13న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారులందరికీ ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేస్తారని, వాహనమిత్ర లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆమేరకు మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెంబరు 19 తేది 30.6.2022న విడుదల చేసిందని, 15-7-2021 నుంచి 3-6-2022 వరకు రవాణాశాఖలో రిజిస్ట్రేషన్‌లు, యాజమాన్య బదిలీలు చేయించుకున్న ఆటో, టాక్సీ, మాక్సీక్యాబ్ వాహన యజమానులు, డ్రైవింగ్ లైసెన్సులు కలిగినవారు కూడా ఈ పథకానికి అర్హులని ఆయన పేర్కొన్నారు. గత ఏడాది లబ్ధిదారుల జాబితా, మరియు కొత్త లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించి అర్హత ధృవీకరించిన తర్వాత గ్రామ, లేదా వార్డు సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాక, అధికారుల ఆమోదం పొందిన అర్హతగల లబ్ధిదారులకు ఆ మొత్తాలు మంజూరవుతాయని తెలిపారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సిఎం

## ఉదయగిరిలో.. వ్యవసాయ కళాశాలకు అనుమతి




ఉదయగిరిలో దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి స్మారకంగా ఏర్పాటుచేస్తామన్న వ్యవసాయ కళాశాలకు అనుమతులిచ్చి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన చిన్ననాటి స్నేహితుడైన గౌతమ్‌రెడ్డి కుటుంబానికి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఈనెల 6న ముఖ్యమంత్రి ఆ మేరకు తాజాగా ఉత్తర్వులిచ్చారు. ఉదయగిరిలో మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలను ఏర్పాటుచేయడమే కాకుండా ఈ విద్యాసంవత్సరం నుంచే అడ్మిషన్లు ప్రారంభించేందుకు సిఎం అనుమతులు మంజూరు చేయడం పట్ల గౌతమ్‌రెడ్డి తండ్రి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి సిఎంకు ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.


# రాష్ట్రంలోని పథకాలు.. దేశానికే ఆదర్శం

## ➤ సిఎం జగన్ కృషితో ఏపిలో నవోదయం
## ➤ ప్రశంసించిన ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న



రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో దూరదృష్టితో రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న నవరత్నాల వంటి ఎన్నో పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రశంసించారు. ఈనెల 6న ఆయన ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరులో ఉన్న గునుపాటి రుక్మిణమ్మ, సుబ్బరామిరెడ్డి మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 72 లక్షల రూపాయలతో 'నాడు-నేడు' పథకం కింద నిర్మాణం చేపట్టనున్న 6 అదనపు గదులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులపై శ్రద్ధ చూపలేదని, జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఎంతో కృషి జరుగుతూ ఏపిలో నవోదయానికి నాంది పలికిందని కొనియాడారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు సిఎం చేస్తున్న కృషి అపారమన్నారు. భావిభారతపౌరులకు మంచి భవిష్యత్తును అందజేస్తున్న సిఎంకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులంతా బాగా చదువుకుని ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుంటూ విద్యలో ఉన్నతస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉత్తమశ్రేణి మార్కులు సాధించిన విద్యార్థులకు 10వేల రూపాయల వంతున ప్రోత్సాహక బహుమతులను ప్రకటించారు. అనంతరం విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలను పంపిణీ చేశారు. తహశీల్దార్ సుబ్బయ్య, ఎంపిడిఓ రఫీఖాన్, ఎంఇఓ హరిబాబు, ఎడిఏహెచ్ మురళీకృష్ణ, సిడిపిఓ హేనాసుజన్, హెడ్మాస్టర్ మల్లికార్జున, నాయకులు కైలాసం శ్రీనివాసులురెడ్డి, ఆదిశేషారెడ్డి, గూడూరు ప్రభాకర్‌రెడ్డి, లేబూరు వెంకురెడ్డి పాల్గొన్నారు.

# మళ్ళీ 'బండ' పడింది




## గ్యాస్ సిలిండర్‌పై మరో 50 పెంచేశారు

మళ్లీ జనం నెత్తిన గ్యాస్ బండ పడింది. వంట గ్యాస్ వంటింట్లో మరింత మంట పెట్టింది. గ్యాస్ సిలిండర్ ధరను మరో 50 రూపాయలు పెంచుతూ గృహ వినియోగదారులకు చమురు సంస్థలు చుక్కలు చూపించాయి. ఈ పెంపుదల వెంటనే అమలులోకి వస్తుందని కూడా హెచ్చరించాయి. అంతర్జాతీయంగా ధరలు పెరుగుతున్నందువల్ల గ్యాస్ ధరలు కూడా పెంచక తప్పడం లేదని ముక్తసరిగా ముక్తాయింపునిచ్చాయి. ఈ సరికొత్త పెంపుతో గ్యాస్ సిలిండర్ (14.2 కిలోలు) ధర వెయ్యి నుంచి సుమారు 1100 రూపాయల దాకా పెరిగినట్లయింది. ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటిదాకా గ్యాస్ ధర నాలుగుసార్లు పెరిగింది. మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్లుగా ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు పెరిగి సామాన్య, మధ్య తరగతి ప్రజలు కుయ్యోమొర్రోమంటుంటే గ్యాస్ ధర కూడా భగ్గుమనడంతో ఈ బండ బాదుడు భరించలేక ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. అందుకు తగ్గట్టుగా కేంద్రప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని రెండేళ్ళ క్రితమే ఎత్తివేయడం, నిరుపేదలైన ఉజ్వల పథకం లబ్దిదారులకు మాత్రమే సబ్సిడీ ఇస్తుండడంతో సాధారణ ప్రజలు ఆర్థికభారం మోయలేక.. గ్యాస్ కొనలేక, కొనకపోతే జీవనం సాగక పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం!


# రెడ్‌క్రాస్‌లో 23, 24 తేదీల్లో... ఉచిత కృత్రిమ అవయవాల శిబిరం

రెడ్‌క్రాస్ నెల్లూరుశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు వరంగా ఈనెల 23, 24 తేదీల్లో ఉచితంగా కృత్రిమ అవయవాల శిబిరాన్ని ఏర్పాటుచేస్తున్నారు. ఈ శిబిరంలో దివ్యాంగులకు జైపూర్ కృత్రిమ కాళ్ళు, చేతులు ఉచితంగా అమర్చేందుకు అవసరమైన స్క్రీనింగ్, కొలతల క్యాంపు నిర్వహిస్తున్నామని, రాయచూర్‌కు చెందిన రాజ్మల్‌కెమ్ రాజ్ భండారి ఫౌండేషన్, భగవాన్ మహావీర్ దివ్యాంగుల సహాయక సమితి-జైపూర్ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మెన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. జైపూర్ వారి సహకారంతో స్క్రీనింగ్ చేసి కొలతలు తీసుకుంటారని, నెల్లూరులోని కూరగాయల మార్కెట్ దగ్గర ఉన్న రెడ్‌క్రాస్ మీటింగ్‌హాల్‌లో శిబిరం నిర్వహిస్తామని, ఈనెల 21వ తేది లోపు రెడ్‌క్రాస్ జిల్లా కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ శిబిరానికి వచ్చే దివ్యాంగులకు, వారి సహాయకులకు ఆయా రోజులలో ఉచితంగా భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. స్క్రీనింగ్ క్యాంపు తరువాత నెల రోజుల లోపు అవయవాలను అమర్చడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగులు తమ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, వైకల్యం కలిగిన కాలు లేదా చేయి ఫోటో, ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నెంబర్‌లను తెలియజేయాలని సూచించారు. అవసరమైన దివ్యాంగులు ఈనెల 21వ తేదీ లోపు రెడ్‌క్రాస్ కార్యాలయం నందు కానీ లేదా 9440529662, 9440333432 ఫోన్ నెంబర్లకు వాట్సప్ ద్వారా గాని పంపి పేర్లు రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు.

లాయర్
జులై 08, 2022

ఇదెప్పుడో చేయాల్సింది.. ఆలస్యమైనప్పటికీ ఇప్పటికైనా కలదెలుసుకోవడం మేలే. దేశంలో ప్రతి ఏటా దాదాపు 2.4 లక్షల టన్నుల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తి అవుతున్న తరుణంలో కేంద్రం నిషేధానికి ముందడుగు వేయడం శుభపరిణామమేనని చెప్పక తప్పదు. ప్లాస్టిక్ భూతం మానవాళి మనుగడకే ప్రమాదాన్ని తెస్తోంది. దీనిని తరిమికొట్టకపోతే భావితరాలు క్షమించవు. ఇప్పటికే దేశంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ ప్రవాహాలే కనిపిస్తున్నాయి. ఒక్కసారి వాడిపారేసే ఈ సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ ఎక్కడచూసినా టన్నుల కొద్దీ పేరుకుపోతోంది. వీధులు, కాలువలు, నదులు, సాగరాలు అన్నీ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. ఇంకా ప్రతిరోజూ ప్లాస్టిక్ వ్యర్థాలు టన్నులకొద్దీ పడుతూనే ఉన్నాయి. ఒక్క భూమిమీదనే కాదు, ప్రపంచవ్యాప్తంగా సముద్రాలు కూడా ఈ ప్లాస్టిక్ వల్ల కలుషిత కాసారాలుగా మారిపోతుండడం విచారకరం. దాదాపు 5 ట్రిలియన్లకు పైగానే ప్లాస్టిక్ వ్యర్థాలు మహాసముద్రాల్లో పేరుకుపోతున్నాయని నిపుణుల ఆందోళన. భూమిపై నుంచి ప్రతి ఏటా 8 మిలియన్ టన్నుల కంటే ఎక్కువ ప్లాస్టిక్ వ్యర్థాలు మహాసముద్రాల్లో కలుస్తున్నాయని, దీనివల్ల భూమిమీదనే కాక సముద్రాల్లో ఉండే జీవజాతులకు కూడా ముప్పు కలుగుతోందని, వీటిని పూర్తిస్థాయిలో నివారించడానికి ఎన్నేళ్ళు పడుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడిందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా దాదాపు 40 కోట్ల టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తి అవుతుంటే, దాంతో సుమారు 40 శాతం దాకా ఉత్పత్తులను ఒక్కసారి మాత్రమే వినియోగిస్తున్నట్లు నిపుణుల గణాంకాలు చెప్తున్నాయి. ప్రకృతిని, పర్యావరణను నాశనం చేస్తూ, నానారకాల జబ్బులకు కారణం అవుతూ దేశాన్ని పట్టిపీడిస్తున్న ప్లాస్టిక్ మహమ్మారిని మనదేశంలో ఇప్పటికైనా నిషేధించడం సంతోషకరం. అయితే నిషేధంతోనే సరిపెట్టుకోక, దానిని పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు అన్నివిధాలా కృషిచేయకుంటే పరిస్థితి మళ్ళీ మొదటికే వస్తుంది. ప్లాస్టిక్ పర్యావరణానికి ఎంతో ముప్పు అని తెలిసినా ఇప్పటికీ విచ్చలవిడిగా దాని వినియోగం జరుగుతూనే ఉంది. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిపొరలపై ఏళ్ళ తరబడి పేరుకుపోయి నేలనంతా కలుషితం చేసేస్తున్నాయని, ముఖ్యంగా వన్యప్రాణులకు అవి ఎంతో హాని కలిగిస్తున్నాయని, ఆహారోత్పత్తులు కూడా కలుషితం అవుతున్నాయని, ఇప్పటికే వాడిపారేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయని అధ్యయనాలు చెప్తున్నాయి. ఈ ప్లాస్టిక్ వల్ల ప్రజల ఆరోగ్యానికి కూడా దెబ్బే. అయినా, ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వినియోగమే కనిపిస్తోంది. ప్లాస్టిక్ అనేది జనజీవనంలో ఒక భాగంగా కలగలిసిపోవడంతో దీన్ని మానడం ఒక సవాల్‌గా మారింది. అయితే ప్రజలందరి ఆరోగ్యం దృష్ట్యా, పర్యావరణ పరిరక్షణకు తప్పనిసరిగా దాని వాడకాన్ని మానుకోవాల్సిందే. దీంట్లో మరోమాట లేదు. అందుకే ప్లాస్టిక్‌ను ఉపయోగించకుండా ఎవరికివారు నిషేధం విధించుకోవాలి. ఇది అందరి కర్తవ్యం. ప్లాస్టిక్‌కు బదులు గుడ్డసంచులు, జనపనార, కాగితం సంచులు వగైరాలను ఉపయోగించుకోవాలి. ప్లాస్టిక్‌ను నిషేధించే కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం ప్లాస్టిక్ స్టిక్స్ ఉండే ఇయర్‌బడ్స్, బెలూన్లు, ఐస్‌క్రీమ్‌లలో వాడే ప్లాస్టిక్ పుల్లలు, ప్లాస్టిక్ ప్లేట్లు, స్పూన్లు, గ్లాసులు, స్ట్రాలు, ప్లాస్టిక్ కవర్లు, కప్పులు, ఫోర్కులు, సిగరెట్ ప్యాక్‌లు, ప్లాస్టిక్ స్వీట్‌బాక్స్‌లు చుట్టే కవర్లతో సహా 19 రకాల ఉత్పత్తులను కేంద్రప్రభుత్వం నిషేధించింది. వీటిని ఎవరు తయారుచేసినా, లేదా వాడినా అయిదేళ్ళ జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ప్రస్తుతానికి 75 మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లను నిషేధించినప్పటికీ, ఈ ఏడాది చివరికల్లా 120 మైక్రాన్లకన్నా తక్కువున్న ప్లాస్టిక్‌ను నిషేధించాలని కూడా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం. దేశవ్యాప్తంగా జులై 1 నుంచి ప్లాస్టిక్ (సింగిల్ యూజ్) నిషేధం అమలులోకి వచ్చింది. ప్లాస్టిక్ నియంత్రణలో రాష్ట్రాలు కీలకపాత్ర పోషించాలని కేంద్రం రాష్ట్రాలకు స్పష్టం చేసింది. నిషేధం ఉల్లంఘించిన వారికి పర్యావరణ పరిరక్షణ చట్టం సెక్షన్15 కింద జరిమానాలు, జైలుశిక్షలు విధించే అవకాశం ఉందని పేర్కొంది. ఏదేమైనప్పటికీ మానవాళికి మనుగడకే ప్రమాదకరంగా మారిన ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రతిఒక్కరూ ఉద్యమించాలి. 'ప్లాస్టిక్ రహిత భారత్'ను నిర్మించుకోవాలి. అందుకు ఇదే మంచి సమయం. ప్రమాదకర ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో నివారించుకున్నప్పుడే అది సాకారమవుతుంది. అప్పుడే.. నిషేధం కూడా విజయవంతమవుతుంది.

## ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం



దేశవ్యాప్తంగా జులై 1 నుంచి ప్లాస్టిక్ (సింగిల్ యూజ్) నిషేధం అమలులోకి వచ్చింది. ఇదెంతో శుభపరిణామం. ఇప్పటికే ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిమీదనే కాదు, సముద్రాల నిండా కూడా పేరుకుపోతోంది. తద్వారా పర్యావరణం కలుషితమై మానవాళికి మనుగడకే ప్రమాదకరంగా మారుతోంది. అందుకే ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రతిఒక్కరూ ఉద్యమించాలి. 'ప్లాస్టిక్ రహిత భారత్'ను నిర్మించుకోవాలి. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో నివారించుకున్నప్పుడే అది సాకారమవుతుంది.

## నగర ఆలయాల వద్ద భక్తులకు భద్రత కరువు..!



నెల్లూరుజిల్లాలో అనేక ప్రముఖ దేవాలయాలు ఉన్నాయి. ఆయా ఆలయాలలో సందర్భాన్ని బట్టి వారాన్ని బట్టి రద్దీ ఉంటుంది. ఉదాహరణకు సోమవారం మూలాపేటలోని శివాలయం, మంగళవారం సంతపేట తదితర ప్రాంతాలలో ఉన్న హనుమాన్ దేవాలయాలు, బుధవారం వినాయకస్వామి గుళ్ళు, గురువారం బాబా మందిరాలు, శుక్రవారం జొన్నవాడలోని కామాక్షి అమ్మవారి ఆలయం, నెల్లూరు నగరంలోని ఇరుకళ లమ్మ, రాజరాజేశ్వరి అమ్మవార్ల దేవాలయాలు... ఇక శనివారం మాగుంట లే అవుట్‌లోని ప్రసన్న వెంకటేశ్వరాలయంతో పాటు ఇతర ప్రముఖ ఆలయాలు. ఇలా ప్రతి వారం ఎక్కడో ఒక చోట జనాభా అధిక సంఖ్యలో ఉంటారు.

### సమస్యల తో 'రణం'

శుక్రవారం మసీదుల్లోను, ఆదివారం చర్చిలలోనూ కూడా భక్తులు అధికంగా ఉంటారు. చాలా మందిరాలలో మహిళలే అధిక శాతం ఉండడం ఇక్కడ గమనార్హం. ఇటీవలి కాలంలో ప్రజలలో భక్తి బాగా పెరిగింది. వారి వారి నమ్మకాన్ని బట్టి తమ ఇష్టదైవాన్ని ప్రార్థించుకోవడానికి తరలి వస్తున్నారు. ముఖ్యంగా చాలాచోట్ల సాయంత్రం నుండి రాత్రి వరకూ ఈ రద్దీ ఎక్కువగా ఉంటోంది. అలాంటి ప్రదేశాలలో కట్టుదిట్టమైన భద్రత ఉందా...? అక్కడికి వచ్చే భక్తులకు పోలీసుశాఖ తగిన రక్షణ కల్పిస్తుందా?? అంటే లేదు అనే సమాధానమిస్తున్నారు మహిళలు. విపరీతమైన రద్దీ ఉన్న వేళల్లో కూడా కనీసం ఖాకీ ఊసైనా కనపడడం లేదని వాపోతున్నారు.

మాగుంట లే అవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి గుడి వద్ద ప్రతి శనివారం ఉదయం సాయంత్రం ట్రాఫిక్కు కూడా అంతరాయం కలుగుతోంది. వారం, విశేషం, ప్రాముఖ్యతను బట్టి అనేకచోట్ల ఇదే పరిస్థితి. ప్రజల రక్షణను, ఇబ్బందులను గాలికి వదిలేసి రాజకీయ నేతల సేవలో తరిస్తూ వారి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న పోలీసు శాఖ, జిల్లాలో... ముఖ్యంగా నగరంలో ఉన్న వివిధ మతాలకు చెందిన పవిత్ర పుణ్య ప్రదేశాలపై కూడా దృష్టిపెడితే బాగుంటుంది.

- సంచారి

## నెల్లూరీయులు బాలసుబ్రహ్మణ్యంని మరచిపోయారా?

ప్రపంచ ప్రఖ్యాత గాయకులు, మన తెలుగువాడు, అన్నింటినీ మించి మన నెల్లూరీయుడు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం. అన్ని భారతీయ భాషల్లో అజరామరమైన పాటలను తన గాత్రం ద్వారా వినిపించిన మహాగాయకుడాయన. అలాంటి ఆణిముత్యం లాంటి 'మణి', పాటల గని కరోనా కాటుతో మనకు దూరమై మరో రెండు నెలల్లో రెండేళ్ళు గడుస్తుంది. నెల్లూరుజిల్లా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ఘనత బాలుది. అంతటి ఘనకీర్తి సాధించిన వ్యక్తికి నెల్లూరులో ఒక్క స్మారకం కూడా లేకపోవడం దారుణం. ఆయన ప్రతిభ గుర్తించిన మన పొరుగు రాష్ట్రాలు ఆయనను సముచిత రీతిలో సంస్మరించుకుంటున్నాయి. కొన్ని ప్రధాన రహదారులకు ఆయన పేరు పెడుతున్నాయి. మరికొన్ని చోట్ల ఆయన విగ్రహాలని ప్రతిష్ఠించుకుంటున్నాయి.

నెల్లూరుజిల్లాలో మాత్రం కేవలం సంగీత కళాశాలకు ఆయన పేరు పెట్టి చేతులు దులిపేసుకున్నారు జిల్లా నాయకులు. ఆయన విగ్రహాన్ని నెలకొల్పాలన్న ఆలోచన కానీ, ఆయన పేరుతో నగరంలో ఒక మార్గాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రయత్నం కానీ ఎవరూ చేయకపోవడం శోచనీయం. నెల్లూరులో ఉన్న బాలసుబ్రహ్మణ్యం అభిమానులు, ఇతర రాష్ట్రాలలో, దేశాలలో ఉన్న బాలు అభిమానులు ఈ విషయంలో చొరవ చూపించాలి. బాలసుబ్రహ్మణ్యానికి జిల్లాలో సముచిత స్థానం కల్పించి జిల్లా ప్రధాన కేంద్రంలో ఆయన విగ్రహం ఏర్పాటుచేయించాలి. ఆయన పేరుతో ఒక కళానిలయం, నగరంలో ఒక ప్రధాన మార్గం కూడా ఏర్పాటుచేస్తే బాగుంటుంది. ఇదే మన బాలుకి మనమిచ్చే నిజమైన నివాళి.

–లక్ష్మీ భరద్వాజ్, హైదరాబాదు.

## గురువుగారు... శ్రీవారి దివ్యదర్శనానుభూతి కలిగించి తరింపజేశారు

శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యుల వారి జయంతిని నెల్లూరు నగరంలో నిర్వహించడం చాలా గొప్ప విషయం. ఈ కార్యక్రమాన్ని తమ భుజస్కందాల పైకి ఎత్తుకుని నిర్వహిస్తున్న కమిటీ వారికి ముందుగా నా అభినందనలు. గత సంవత్సరాలలో విగ్రహం వద్ద నిర్వహింపబడిన అన్ని కార్యక్రమాలలో కూడా నేను పాల్గొన్నాను. కానీ ఈ ఏడాది గత కార్యక్రమాలకు భిన్నంగా శ్రీ చాగంటి వారిని తీసుకురావడం అభినందనీయం. ముందుగా విగ్రహం వద్ద అన్నమయ్య సంకీర్తనాలాపన, అక్కడి నుండి కీర్తనలు పాడుకుంటూ సభా ప్రాంగణం వరకూ వందలాది మంది భక్తులు కాలినడకన వెళ్ళడం వంటి కార్యక్రమాలన్నీ అన్నమయ్య ఆరాధకులను, ఏడుకొండలవాడి భక్తకోటిని తన్మయత్వంలో ముంచేశాయి. పీవీఆర్ కళ్యాణమండపంలో 'శ్రీ వేంకటేశ్వర వైభవం'పై చాగంటి కోటేశ్వరరావు గారు చేసిన ప్రవచనం అందరినీ పరవశింపజేసింది. తన మాటలలో సాక్షాత్తు కలియుగ ప్రత్యక్ష దైవాన్ని కళ్ళముందు సాక్షాత్కరింప చేశారు గురువు గారు. అక్కడ ఉన్న వేలాది మంది భక్తులకు తాము తిరుమలలో స్వామివారి సన్నిధిలోనే ఉన్నామా అన్న అనుభూతిని కలిగించారు చాగంటి వారు. చాలా రోజుల తరువాత మనసుకు ప్రశాంతత కలిగించే అద్భుతమైన ఆధ్యాత్మిక కార్యక్రమం నగరంలో జరగడం సంతోషకరం.

ఎం.ఎల్.నరసింహాశర్మ - పోస్టల్ కాలనీ, నెల్లూరు.




## తిట్ల రాజకీయాలు మాని... అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

నెల్లూరుజిల్లాలో అధికార పార్టీ నాయకులు తిట్ల పురాణాలు మాని అభివృద్ధిపై దృష్టిసారిస్తే బాగుంటుంది. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన ఈ మూడేళ్ళలో తాము గొప్పగా చెప్పుకోదగిన ఒక్క పనికూడా అధికారపార్టీ నేతలు చేయలేదనడంలో సందేహం లేదు. ముఖ్యంగా జిల్లా ప్రధాన కేంద్రం నెల్లూరు నగరంలో పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. నగరంలో ప్రవేశించినప్పటినుండి నరకం కనిపిస్తుంది. ప్రధాన రహదారులన్నీ దురాక్రమణలతో నిండిపోయాయి. గతుకుల రోడ్లు, వెలగని లైట్లు, దుర్గంధభూయిష్టంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ, అస్తవ్యస్తమైన పార్కింగ్ విధానం... ఇలా చెప్పుకుంటూ పోతే నగరమంతా సమస్యల వలయమై వర్ధిల్లుతోంది. అధికార ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడం తప్ప సమస్యలపై దృష్టి పెట్టడంలేదు. ఒకరు అధికారంలో ఉంటే ఇంకొకరు విమర్శించడం సర్వసాధారణం. తమ చేతలతో ప్రతిపక్ష పార్టీల ఆరోపణలకు సమాధానం చెప్పాలి తప్ప, వాళ్ళు ఒకటి అంటే మనం రెండు అని కాదు. అధికార పార్టీ నేతలు ఈ మూడేళ్ళలో తామేం చేశామో ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఎక్కడో జరుగుతున్న ఉప ఎన్నికలలో తాము సాధించే ఫలితాలు ఇక్కడ తమ పనితనానికి నిదర్శనమని భావిస్తే అది మూర్ఖత్వమే అవుతుంది.

– ఆర్.పి.రామయ్య, కొండాయపాళెం.

## కేంద్రం నుంచి రాయితీలు రాబట్టాలి

జూన్ 24 తేదీన వెలువడిన 'లాయర్' పత్రికలో "ఉండవల్లి అక్షర సత్యాలు" ఆర్టికల్‌లో 2024 జనరల్ ఎలక్షన్స్‌లో బీజేపీ 25 యం.పి సీట్లు గెలుస్తుందని మాజీ యం.పి ఉండవల్లి అరుణ్‌కుమార్ వ్యాఖ్యలు చేశారు. అది నిజమే అయ్యేలా ఉంది... నేటి వైయస్సార్ కాంగ్రెసు పార్టీ తీరు చూస్తుంటే!

ఎందుకంటే రాష్ట్రపతి ఎన్నికల్లో తన పార్టీకి 45వేలకు పైగా ఎలక్టోరల్ కాలేజీ ఉన్నప్పటికీ, బీజేపీ అభ్యర్థి గెలవాలంటే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ సహకారం ఎంతో అవసరం ఉన్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేకహోదా గురించి బీజేపీని గట్టిగా కోరడం లేదు, పోలవరం ప్రాజెక్టుకు కావాల్సిన కేంద్ర ప్రభుత్వ నిధులు గురించి గట్టిగా అడగటం లేదు, చివరికి రాష్ట్రానికి రావాల్సిన జీఎస్‌టీ పన్నుల వాటా గురించి కూడా అడగటం లేదు, విభజన చట్టంలో పొందుపరచివున్న కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటు గురించి అడగటం లేదు.

ఇప్పటికైనా రాష్ట్రపతి ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన రాయితీలన్నిటిని రాబట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డా. రాచపాళెం రఘు, మెక్సికో దేశం.

### పాఠకులకు మనవి..!

మన లాయర్ పత్రికలో ప్రచురితమవుతున్న అంశాలపై మీ అభిప్రాయాలను, సమాజ అభ్యుదయం కోసం ఉపకరించే మీ ఆలోచనలను మాతో క్లుప్తంగా పంచుకోండి. విషయ ప్రాధాన్యతను బట్టి వాటిని 'ప్రజావాణి'లో ప్రచురిస్తాం.

మీ భావాలను పంపవలసిన వాట్సాప్ నెంబర్: 98663 14741.

సం/-

# 8-9 తేదీల్లో గుంటూరులో వైకాపా ప్లీనరీ



## విజయవంతం చేయాలన్న వేమిరెడ్డి, కాకాణి

ఈనెల 8-9 తేదీల్లో గుంటూరులో వైకాపా రాష్ట్ర ప్లీనరీ జరుగుతుందని, కార్యకర్తలు.. నాయకులు అందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వైకాపా జిల్లా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు 'సేవాభూషణ్' వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి కోరారు.

ఈనెల 5న నెల్లూరులోని వేమిరెడ్డి కార్యాలయంలో జిల్లా ముఖ్యనేతలు, ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్లీనరీని జయప్రదం చేసేందుకు జిల్లాలో అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. అందుకు నియోజకవర్గాల వారీగా వైకాపా నాయకులు తగు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి తదితర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

## పుట్టినరోజు శుభాకాంక్షలు



భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు జన్మదినం సందర్భంగా జులై 1న చెన్నైలోని రాజ్‌భవన్‌లో అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు ప్రొ. సి.యం.కె.రెడ్డి నేతృత్వంలో సమాఖ్య సభ్యులు వెంకయ్యను కలసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఇదే తరుణంలో వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆచార్య సి.యం.కె.రెడ్డికి ఉపరాష్ట్రపతి అభినందనలు తెలియజేశారు.

### కనుపర్తిపాడులో కన్నులపండువగా..

## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుని బ్రహ్మోత్సవాలు



నెల్లూరు సమీపంలోని కనుపర్తిపాడు గ్రామంలో వెలసివున్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 4 నుంచి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో, ఆలయ ప్రధాన అర్చకులు కందాల శ్రావణకృష్ణ ఆధ్వర్యంలో వేదపండితులు సోమవారం (4వ తేది) స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేకపూజలు చేసి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. 5వ తేది మంగళవారం ఉత్సవాల ప్రారంభసూచకంగా ధ్వజారోహణ నిర్వహించారు. అనంతరం ఉభయదేవేరులతో సర్వాలంకారభూషితులైన స్వామివారిని మంగళవాద్యాలు, మేళతాళాల మధ్య బాణసంచా వేడుకలతో ఊరేగించారు. అభిషేకం, రుద్రాక్ష మండప సేవలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఆలయ శాశ్వత ధర్మకర్తలు వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి-గిరిజమ్మ, వారి కుటుంబసభ్యులు (కనుపర్తిపాడు) ఉభయకర్తలుగా వ్యవహరించారు. రాత్రి స్వామివారు శేషవాహనోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. చెన్నైకి చెందిన విస్సా కశ్యప్-లలిత దంపతులు ఉభయకర్తలుగా పాల్గొన్నారు. ఈనెల 14వ తేది వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

## రావిప్రోలు సేవలు అపూర్వం

### - శతజయంతి సభలో కొనియాడిన వక్తలు




ప్రఖ్యాత పురావస్తు శాస్త్రవేత్త, నెల్లూరుజిల్లా పల్లిపాడు గ్రామ వాస్తవ్యులైన డా. రావిప్రోలు సుబ్రహ్మణ్యం పురావస్తు పరిశోధనలో అగ్రగణ్యులని, ఆయన సేవలు అపూర్వమని పలువురు వక్తలు కొనియాడారు. ఈనెల 4న హైదరాబాద్‌లో డా.రావిప్రోలు శతజయంతి సభ జరిగింది. ప్రముఖ ఆర్కియాలజిస్ట్, హైదరాబాద్‌లోని ప్లీచ్ ఇండియా సంస్థ సిఇఓ డా.ఈమని శివనాగిరెడ్డి సభకు అధ్యక్షత వహించారు. 1954-60ల మధ్య కాలంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారి సారథ్యంలో డా. రావిప్రోలు ఆధ్వర్యంలో జరిగిన పురావస్తు తవ్వకాల్లో లభించిన అమూల్యమైన చారిత్రక సంపదనంతా భావితరాల వారికోసం నాగార్జునకొండపై ఐలండ్ మ్యూజియంలో భద్రపరిచిన ఘనత రావిప్రోలుదని కొనియాడారు. ఎస్వీయు విశ్రాంత చరిత్ర ఆచార్యుడు డా.ఎన్ఎస్ రామచంద్రమూర్తి డా. రావిప్రోలుతో తనకున్న అనుబంధాన్ని, రావిప్రోలు ప్రతిభాపాటవాలను తెలియజేశారు. హైదరాబాద్ సర్కిల్ ఆర్కియాలజిస్ట్ స్మితాకుమార్ పాల్గొని డా.రావిప్రోలు నాగార్జునకొండ తవ్వకాలు, వాటి విశిష్టతను తెలియజేశారు. ఏపి ఆర్కియాలజీ, మ్యూజియమ్స్ విశ్రాంత డైరెక్టర్లు డా.డివిఎన్ శాస్త్రి, డా.జివి రామకృష్ణ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా.రావిప్రోలు శతజయంతి సావనీర్‌ను ఆవిష్కరించారు. రావిప్రోలు జీవితం, పరిశోధనలకు సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్‌కు డా.తాహిర్, డా. శివనాగిరెడ్డిలు ప్రారంభోత్సవం చేశారు. తెలంగాణ ఆర్కియాలజీ, మ్యూజియమ్స్ డైరెక్టర్ డా. కేదారేశ్వరి, డా.బాబ్జీరావు, ఏపి హిస్టరీ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ డా.ఎం సోమశేఖర్‌రావుతో పాటు పలువురు విదేశీ ప్రతినిధులు, డా.రావిప్రోలు సుబ్రహ్మణ్యం కుమారుడు..బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విశ్రాంత డైరెక్టర్, సైంటిస్ట్ (ఎఫ్) ఆర్ సోమశేఖరశర్మ, రావిప్రోలు కుటుంబసభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### యూ ట్యూబర్లను ఆకట్టుకుంటున్న

# 'తంగిరాల మహాభారతం'



*మహాభారతం ఎవరు చెప్పినా సారాంశం ఒక్కటే. మూలం అదే. కానీ దానిని వివరించడంలో ఒక్కొక్కరిదీ ఒక్కొక్క పద్ధతి. నేటి సమాజానికి అవసరమైన తరహాలో, పామరులకు సైతం అర్థమయ్యే రీతిలో ఎక్కడో అమెరికాలో కూర్చుని వారంవారం యూట్యూబ్‌లో మహాభారతాన్ని వివరిస్తున్న 'తంగిరాల శ్యామ్ మహాభారతం' నెటిజనులను ఆకర్షిస్తోంది.*

తంగిరాల శ్యామ్ పౌరాణికుడు కాదు. వరంగల్ ఎన్.ఐ.టీలో ఇంజినీరింగ్ పట్టా పొంది, అమెరికాలో ఎం.ఎస్ చేసి, అక్కడే స్థిరపడిన సాఫ్ట్‌వేర్ నిపుణుడు. అతిపెద్ద టెలికాం కంపెనీలో మంచి హోదాలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన చేసే ఉద్యోగానికి, మహాభారతం ప్రవచనానికి అసలు సంబంధమే లేదు. ఆయన అమెరికా పౌరుడు కూడా. అయినప్పటికీ, తన తల్లిగారి నుంచి అలవాటు చేసుకున్న ఆధ్యాత్మిక చింతన, ఆయనను మన పురాణేతిహాసాల వైపు దృష్టిసారించేలా ప్రేరేపించింది.


మహాభారతాన్ని తెలుగులో చాలా మంది ప్రవచకులు చెప్పిన వీడియోలు మనకు యూట్యూబ్‌లో లభిస్తాయి. అయితే ఒక్కొక్కరిది ఒక్కో పంథా.

శ్యామ్ తంగిరాల చేస్తున్న ప్రయత్నం వాటికి భిన్నం. అతి సామాన్యుడికి సైతం అర్థమయ్యే వ్యావహారిక భాషలో, వీక్షించే వారెవరైనా తరువాత భాగం ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసేలా వివరిస్తుండడం ఆయన ప్రత్యేకత. ఆయన ప్రతి వారం యూట్యూబ్ వీక్షకుల కోసం వివరించబోయే మహాభారతం సంగ్రహాన్ని తమ పాఠకులకు ప్రతి వారం ముందుగానే అందించే ప్రయత్నం చేస్తోంది 'లాయర్'.

ఇప్పటికే పది వారాలు పూర్తిచేసుకున్న శ్యామ్ తంగిరాల గళానికి తోడుగా తన కలాన్ని కలుపుతోంది మన 'లాయర్'. యూట్యూబ్‌లో ప్రసారం కానున్న 11వ భాగం నుండి ఇక ప్రతివారం రాబోయే అంశం గురించి పాఠకులకు ముందే రుచిచూపించనుంది. ఆస్వాదించండి.... ఆనందించండి.

గడచిన 10 భాగాల కోసం యూట్యూబ్‌లో 'తంగిరాల శ్యామ్ మహాభారతం' అని టైప్ చేసి వీక్షించండి.

సం/-




### 'తంగిరాల మహాభారతం'

### 11వ భాగం

కచుడు మృతసంజీవనీ విద్య నేర్చుకున్న తర్వాత కూడా కొన్ని రోజులు శుక్రాచార్యునికి శిష్యరికం చేస్తాడు. ఒకరోజు శుక్రాచార్యుడు పిలిచి అనుజ్ఞ ఇస్తాడు ఇక నీ చదువు అయిపోయింది, అమరలోకం వెళ్లిపోవచ్చు అని. కచుడు శుక్రాచార్యుని వద్ద సెలవు తీసుకుని దేవయాని అనుమతి కోసం వస్తాడు. దేవయాని నిర్ఘాంతపోయి, అతన్ని కోరుతుంది తనను పెళ్లి చేసుకోమని. కచుడు నీవు నాకు సోదరి లాంటి దానివి, నాకా భావం లేదు అని చల్లగా చెపుతాడు. దేవయానికి విపరీతమైన కోపం వచ్చి అతని మీదున్న ప్రేమ ద్వేషంగా మారి అతన్ని శపిస్తుంది, నీకు మృతసంజీవనీ విద్య ఎందుకూ పనికి రాకుండా పోతుంది అని. కచుడు కూడా ఆమెను ఏ బ్రాహ్మణుడు కూడా వివాహం చేసుకోడు అని శపించి తన లోకం వెళ్ళిపోతాడు. దేవయాని, రాక్షసరాజు కూతురు శర్మిష్ఠ స్నేహితురాళ్ళు. ఒకరోజు జలకా లాడాలని అరణ్యానికి వెడితే, ఇంద్రుడు వాయురూపంలో వచ్చి వాళ్ళ బట్టల్ని చిందర వందర చేస్తాడు. ఆ హడావిడిలో శర్మిష్ఠ తన చీర కట్టుకుందని దేవయాని తిడుతుంది. శర్మిష్ఠ కూడా దేవయానిని తిడుతుంది. వాళ్ళిద్దరి మధ్య జరిగే తోపు లాటలో శర్మిష్ఠ, దేవయానిని ఒక పాడు బడ్డ బావిలోకి తోసి తన దోవన తాను వెళ్ళిపోతుంది.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
tangirala shyam Mahabharat @YouTubeలో చూడగలరు.



# నెల్లూరు కబుర్లు

## ఆదర్శ నాయకుడు..రోశయ్య

### - కెవి చలమయ్య ఆధ్వర్యంలో జయంతి



తమిళనాడు మాజీ గవర్నర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ఆదర్శనాయకుడని అంతర్జాతీయ వైశ్యసమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధులు కెవి చలమయ్య అన్నారు. ఈనెల 4న రోశయ్య 90వ జయంతి సందర్భంగా తమ నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోశయ్య సహకారంతోనే నెల్లూరుజిల్లాకు 2008 జూన్ 4వ తేదిన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాగా నామకరణం జరిగిందన్నారు. నెల్లూరులో రోశయ్య కాంస్య విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి, నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతి తదితర నాయకులకు ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వి శరత్‌చంద్ర, నగరకంటి రవీంద్రనాథ్, సొల్లేటి నాగేశ్వరరావు, సోమిశెట్టి వెంకటరత్నం, రాయవరపు కల్యాణచక్రవర్తి, దర్శి నర్సింహారావు, పేర్ల జనార్ధన్, సిహెచ్ వెంకటేశ్వర్లు, ఆర్‌వి శేషగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

### రాష్ట్ర నాయకుల పిలుపు



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, ఆ పార్టీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు సయ్యద్ హాజీనా, గణేష్ రాథోడ్‌లు పిలుపునిచ్చారు. ఈనెల 5న నెల్లూరులోని ఇందిరాభవన్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. మండల స్థాయి కమిటీలు పార్టీని పటిష్టం చేయడానికి మరింత శ్రద్ధ తీసుకోవాలని ఈ సమావేశంలో పాల్గొన్న డిసిసి అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ నగర ఇన్‌చార్జి షేక్ ఫయాజ్, రూరల్ ఇన్‌చార్జ్ ఉడతా వెంకట్రావ్, జిల్లా ఉపాధ్యక్షులు బాలసుధాకర్, నాయకులు ఏటూరి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అగ్నికుల క్షత్రియ విద్యార్థులకు..

## ప్రతిభా పురస్కారాలు



ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన అగ్నికుల క్షత్రియ విద్యార్థులకు జిల్లా అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ ఏడాది టెన్త్‌లో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను, నిఘంటువులను, జ్ఞాపికలను అందించారు. నెల్లూరు నగరంలోని కామాటివీధి కృష్ణమందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో 50 మంది విద్యార్థులకు ఈ పురస్కారాలను ప్రదానం చేసి అభినందించారు. ఇంజనీరింగ్‌లో బంగారుపతకం సాధించిన కొక్కిలిగడ్డ గీతారమ్యను ఘనంగా సన్మానించారు. గత పన్నెండేళ్ళుగా తమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిఏటా ఇలా నగదు పురస్కారాలను అందజేస్తున్నామని సంఘం ప్రధాన కార్యదర్శి శివశంకర్ చెప్పారు. ముత్తుకూరు ఎంపిపి గండవరం సుగుణ, డికెడబ్ల్యు కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.వెంకట్రావు, డిఆర్‌డబ్ల్యు మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల ఈశ్వరప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ మునిమనోజ్, రాసాని నాగరాజు, సుప్రజ, జిల్లా అగ్నికుల క్షత్రియ సంఘం ఉపాధ్యక్షులు వేలూరు పెంచలనరసింహం, తిరుమల్‌రెడ్డి, శ్రావణ్‌మునికుమార్, రాము, శ్రీధర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్‌ఎస్ బ్రదర్స్.. కొత్త షోరూం

### వరుణ్‌తేజ్ రాకతో సందడే సందడి

నెల్లూరులో ప్రముఖ వస్త్రవ్యాపారసంస్థ ఆర్‌ఎస్ బ్రదర్స్ ఆధ్వర్యంలో కొత్త షోరూం ఇటీవల ప్రారంభమైంది. నగరంలోని గాంధీబొమ్మ కూడలి వద్ద నెలకొల్పిన ఈ షోరూంకు ప్రముఖ సినీనటుడు, టాలీవుడ్ మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్ ప్రారంభోత్సవానికి విచ్చేయడంతో పెద్దసంఖ్యలో మెగా అభిమానులు తరలివచ్చారు. దీంతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. తిరుమల తిరుపతి దేవస్థానాల ఉత్తరభారతదేశ స్థానిక సలహామండలి అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలనం చేశారు. షోరూంను ప్రారంభించిన అనంతరం వరుణ్‌తేజ్ షాపింగ్ మాల్‌లో కలయతిరిగారు. వెరైటీ వస్త్రాలను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వస్త్ర ప్రపంచంలో ఆర్‌ఎస్ బ్రదర్స్ సరికొత్త వెరైటీ వస్త్రాలతో, విశేష జనాదరణతో ముందుకు దూసుకుపోతోందని, ఇప్పటికే ఆంధ్ర, తెలంగాణాల్లోని పలు ప్రాంతాల్లో షాపింగ్‌మాల్స్ ప్రారంభించి వస్త్రప్రపంచంలో తనదంటూ ప్రత్యేకతను సాధించుకుందని, నెల్లూరులో ఇది 12వ షోరూం అని అంటూ, ఇది తన చేతుల మీదుగా ప్రారంభం కావడం తనకెంతో సంతోషం కలిగిస్తోందన్నారు. అన్ని వయసుల వారిని బాగా ఆకట్టుకునే ఎన్నో రకాల వస్త్రాలు ఇక్కడ లభిస్తున్నాయని, ఆర్‌ఎస్ బ్రదర్స్ సంస్థ దినదినాభివృద్ధి చెందాలని తాను ఆకాంక్షిస్తున్నానని చెప్పారు. సంస్థ డైరెక్టర్లు పి.వెంకటేశ్వర్లు, రాజమౌళి, టి.ప్రసాదరావు మాట్లాడుతూ ఈ షోరూంలో సుమారు నాలుగు లక్షలకు పైగానే తాజా వెరైటీ వస్త్రాలున్నాయన్నారు. వినియోగదారుల అభిరుచులకు తగ్గట్టుగా కంచి పట్టుచీరలు, ఫ్యాన్సీచీరలు, డ్రెస్ మెటీరియల్స్, వెస్టన్ వేర్, కిడ్స్‌వేర్, ఆర్‌ఎస్ బ్రదర్స్ బ్రాండెడ్ వెరైటీలెన్నో ఉన్నాయన్నారు. నెల్లూరు ప్రజలు తమ సంస్థను ఆదరించాలని కోరారు.

## ప్లాస్టిక్ వ్యర్థాలతో..నేలంతా కలుషితం



ప్లాస్టిక్‌తో, ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణం నాశనమైపోతోందని, నేలంతా కలుషితం అయిపోతోందని, ప్రజలంతా చైతన్యవంతులై ఈ అనర్థాలను నివారించాలని డాక్టర్ యశోధర అన్నారు. ఈనెల 5న నెల్లూరు డికెడబ్ల్యు కాలేజీలో ప్లాస్టిక్‌పై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పర్యావరణానికి ముప్పు కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని అందరూ మానేయాలని ఆమె కోరారు. ఆమేరకు విద్యార్థినులకు అవగాహన కలిగించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గిరితోపాటు ఎకో క్లబ్ కన్వీనర్ డాక్టర్ రాజరాజేశ్వరి, సభ్యులు డాక్టర్ రవిచంద్రబాబు, కవిత, మమత, జోజి తదితరులు పాల్గొన్నారు.

## కోటంరెడ్డి శీనయ్యకు కరోనా

టిడిపి నెల్లూరు నగర నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి కరోనా సోకింది. ఈనెల 4న అస్వస్థతగా ఉండడంతో కరోనా పరీక్ష చేయించుకుంటే.. పాజిటివ్ వచ్చిందని, అయితే కరోనాకి సంబంధించి స్వల్ప లక్షణాలు మాత్రమే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కార్యకర్తలెవరూ ఆందోళన చెందవద్దని, ఇటీవల తనను కలిసిన అభిమానులు, కార్యకర్తలు కూడా కరోనా పరీక్ష చేయించుకోవాలని ఆయన కోరారు.

## కేంద్ర జలశక్తి అధికారితో.. కలెక్టర్ భేటీ



జిల్లాలో జలవనరుల పరిశీలన కోసం ఈనెల 4న నెల్లూరుకు వచ్చిన కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ డైరెక్టర్, జలశక్తి అభియాన్ నోడల్ అధికారి ఇ.రవీంద్రన్‌ను జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు సాదరంగా స్వాగతించారు. ఈ సందర్భంగా వారిరువురూ జిల్లాలోని పలు జలవనరులు, మెట్టప్రాంతాలు, పండ్లతోటల స్థితిగతులపై చర్చించారు.

## సాయిదర్బార్‌లో ఆయుర్వేద శిబిరం



నెల్లూరు బాలాజీనగర్ శివార్లలో పద్మావతినగర్‌లో ఉన్న శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఇటీవల ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించి అనేకమంది రోగులకు ఉచితంగా ఆరోగ్యపరీక్షలు చేసి అవసరమైన మందులను అందజేశారు. ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు, నెల్లూరులోని కేరళ పంచకర్మ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ యన్ శ్రీవత్సవకుమార్ ఆధ్వర్యంలో సుమారు రెండువందల మందికి ఉచితంగా మందులు ఇచ్చారు. సాయిదర్బార్ తరఫున చేస్తున్న సేవాకార్యక్రమాల్లో భాగంగా ఈ ఆయుర్వేద శిబిరం ఏర్పాటుచేశామని మందిరం నిర్వాహకులు మధుసాయి చెప్పారు. సాయిభక్తబృందంతో పాటు తిరుమలశెట్టి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్లు వద్దనే వద్దు

### - కార్పొరేషన్ అధికారుల ఆధ్వర్యంలో ర్యాలీ



ప్లాస్టిక్ కవర్లు వాడడం మానేయాలని, వాటి వల్ల పర్యావరణానికి ప్రమాదం వాటిల్లుతుందని నెల్లూరు కార్పొరేషన్ ఆరోగ్య అధికారి అమరేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఈనెల 3న నెల్లూరు నగరంలో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక విఆర్‌సి కూడలి వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండ్ దాకా అవగాహన ర్యాలీ నిర్వహించారు. 75 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లను నిషేధించారని, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని చెప్పారు. ప్రజలు ప్లాస్టిక్ కవర్లకు బదులుగా గుడ్డ సంచులు వాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో కార్పొరేషన్ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్‌కు కొత్త కార్యవర్గం



లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరుకు కొత్త కార్యవర్గం ఏర్పాటైంది. నగరంలోని ముత్తుకూరురోడ్డులో ఉన్న వైవి లయన్స్ భవన్‌లో ఈనెల 3న జరిగిన కార్యక్రమంలో నూతన అధ్యక్షునిగా ప్రసాద్, కార్యదర్శిగా డా.ఆర్‌వియస్ కృష్ణకుమార్, కోశాధికారిగా సిహెచ్ ప్రవీణ్‌కుమార్‌లతో పాటు పలువురు కార్యవర్గసభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం కంటి వైద్యశిబిరం నిర్వహించి పేదలకు ఉచితంగా కంటిపరీక్షలు నిర్వహించారు. శుభమస్తు ఫౌండేషన్, లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు సంయుక్తంగా అన్నదానం చేశారు. లయన్ బయ్యా రవికుమార్, గౌతమ్, సురేష్, అమృతవల్లి, రమణయ్య, శ్రీరాములు, రామానుజం తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి పోరాటపటిమను స్ఫూర్తిగా తీసుకోవాలి

**--- జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ---**



మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు త్యాగశీలతను, పోరాటపటిమను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత దేశాభి వృద్ధి కోసం కృషి చేయాలని నెల్లూరు జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ పిలుపునిచ్చారు. నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో ఈనెల 3న అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతారామరాజు దేశభక్తి అపారమైనదని, ఎటువంటి అభివృద్ధి లేని గోదావరి ఏజన్సీ ప్రాంతంలో గిరిజన తెగ వారిలో దేశభక్తిని రగిలించి స్వాతంత్ర్యోద్యమానికి నాంది పలికిన దేశభక్తుడు అల్లూరి సీతారామరాజు అని గుర్తుచేశారు. ఎంతోమంది వీరులు దేశం కోసం ప్రాణాలు అర్పించారని, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. తెలుగుజాతి ఉన్నంతకాలం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు శాశ్వతంగా గుర్తుండిపోతుందన్నారు. ఆయన పేరుతో జిల్లాను ఏర్పాటుచేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తొలుత అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్పి సీఈవో వాణి, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు మరియు జిల్లా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు బాగుండాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష

**- 'సింహపురి రైతు' మాసపత్రిక వార్షికోత్సవంలో మంత్రి కాకాణి**



రైతు బాగుండాలన్నదే ప్రభుత్వం ఆకాంక్ష అని, రైతుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తోందని, రైతుల జీవనప్రమాణాలను పెంపొందించేం దుకు నిరంతరం కృషిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని 'సింహపురి రైతు' మాసపత్రిక 25 సంవత్సరాలు పూర్తిచేసు కున్న సందర్భంగా ఇటీవల సిల్వర్‌జూబ్లీ వేడుకలు స్థానిక టౌన్‌హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి కాకాణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లా డారు. రాష్ట్రంలో దాదాపు 70శాతం మంది వ్యవసాయరంగంపై ఆధారపడి జీవిస్తున్నారని, అందువల్ల రైతులకు తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి అన్ని విధాలుగా అండదండలందిస్తోంద న్నారు. రైతులు మూసపద్ధతిలో కాకుండా ఏ పంటకు డిమాండ్ ఉందో గమనించి పంటలు వేసుకోవాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించేలా ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలం భించాలని కోరారు. గత పాతికేళ్ళుగా సింహపురి రైతు మాసపత్రిక ద్వారా రైతు లకు తగు సూచనలు సలహాలు ఇస్తూ రైతుల శ్రేయస్సుకోసం ఎంతగానో కృషి చేస్తున్న ఆ పత్రిక సంపాదకులు వేమారెడ్డి నిరంజన్‌రెడ్డిని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం సింహపురి రైతు ప్రత్యేకసంచికను మంత్రి ఆవిష్కరిం చారు. ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.ఏ. విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సం క్షేమం, ఆర్థికాభివృద్ధికి తమ విశ్వవిద్యా లయం కృషిచేస్తోందని, రైతుల ఆదాయం పెంచేందుకు అనేక ప్రణాళికలను రూపొం దిస్తున్నామన్నారు. రైతుసంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పెద్దిరెడ్డి చెంగల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జెకె రెడ్డి, ప్రముఖ వదాన్యులు జెవిఎస్ రెడ్డి, రైతుసంఘాల సమాఖ్య నాయ కుడు, సింహపురి రైతు ఉపసంపాదకులు చిరసాని కోటిరెడ్డి, ఆక్వా రైతుల సంఘం నాయకులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి.సుధా కర్‌రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదర్శరైతులు పి.హనుమంత రావునాయుడు, సిహెచ్ ఆదిశేషారెడ్డి, ఏ.లింగారెడ్డి, డి.బాబురావు, ఏ.వెంకట రమణయ్యనాయుడు, డి.శ్రీనివాసులురెడ్డి, డి.మధుసూదన్‌రావు, ఏ.రాధాకృష్ణారెడ్డి, వి.మల్లికార్జున్, టి.హరిప్రసాద్, పి.శ్రీని వాసులును, ప్రత్యేకసంచిక ప్రచురణకు తోడ్పాటునందించిన జంజం కోదండ రామయ్య, ఇ.ముత్యాలరెడ్డి, కరేటి సంపత్ కుమార్‌లను ఘనంగా సన్మానించారు.

# దేవిరెడ్డి శారద ట్రస్టు ఆధ్వర్యంలో.. మెగా వైద్యశిబిరం



అల్లూరు మండలం నార్త్‌మోపూరులో ఉన్న దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 3న మెగా వైద్య శిబిరం నిర్వహించి వందలాదిమంది రోగులకు వైద్యసేవలందించారు. డిఎస్ఆర్ ట్రస్ట్ ఛైర్మెన్ దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి చేతులమీదుగా ఈ ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. కీళ్ళు, ఎముకులు, షుగర్, గర్భకోశ, ఊపిరితిత్తుల వ్యాధులు, చిన్న పిల్లల వ్యాధులకు సంబంధించి దాదాపు 500 మందికి వైద్య నిపుణులు ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ డి.మహేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ ఎల్ సుధీర్‌రెడ్డి, డాక్టర్ ఎం రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ డి.వినోభ, డాక్టర్ ఎం.మనోజ్ కుమార్ పాల్గొని రోగులను పరీక్షించి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. అల్లూరు మండలం నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్దసంఖ్యలో రోగులు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. వచ్చిన రోగులందరికీ ట్రస్ట్ వారు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పెట్టి ఆదరించారు. ట్రస్ట్ సిఇఒ దేవన్‌కుమార్, ట్రస్ట్ వైద్యులు జెట్టి రమేష్, అల్లూరు రామకృష్ణ జూనియర్ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ మేడా వెంకటరమణారెడ్డి, ట్రస్ట్ మేనేజర్ (అడ్మిన్) అనిల్‌కుమార్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి రామచంద్రయ్య, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలంతా జగన్ వైపే

**- తెలుగు అకాడమీ అధ్యక్షురాలు లక్ష్మీపార్వతి**



రాష్ట్ర ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే ఉన్నారని, రానున్న ఎన్నికల్లో కూడా వైకాపానే ప్రజలు గెలిపిస్తారని రాష్ట్ర తెలుగు అకాడమీ అధ్యక్షురాలు లక్ష్మీపార్వతి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈనెల 3న ఆమె తిరుపతి నుండి విజయవాడకు వెళ్తూ మార్గమధ్యంలో మనుబోలులో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నా రని, ముఖ్యంగా పేదలకు, బడుగు బలహీనవర్గాల మహిళలకు ఎంతగానో చేయూత నందిస్తున్నారని, పలు కార్పొరేషన్ పదవుల్లోనూ మహిళలకు పెద్దపీట వేశారని పేర్కొన్నారు. గతంలో ఎన్టీఆర్, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలు మహిళలకు అండగా నిలుస్తూ 50 శాతం రిజర్వేషన్ సౌకర్యం కలిగించారని, ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా అదే బాటలో పయనిస్తూ మహిళారంగం అభ్యున్నతికి అన్నివిధాలా ప్రోత్సాహం అందజేస్తు న్నారని సంతోషం వ్యక్తం చేశారు. లక్షలాదిమంది పేదలకు ఇళ్లపట్టాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఆమె కొనియాడారు.

# కుర్తాళం పీఠాధిపతికి అపూర్వ స్వాగతం

**• నేత్రపర్వంగా నగరంలో శోభాయాత్ర • సౌభాగ్య సరస్వతికి విశిష్ట పూజలు**





కుర్తాళం పీఠాధిపతి పరమహంస పరివ్రాజకాచార్య జగద్గురు సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామికి నెల్లూరు నగర వాసులు హారతులు పట్టి అపూర్వ స్వాగతం పలికారు. స్థానిక పప్పులవీధిలోని శ్రీ గురు దత్తాత్రేయ మఠం ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ సౌభాగ్య సరస్వతి అమ్మవారి దివ్య వైభవోత్సవాల్లో పాల్గొనేందుకు శ్రీ సిద్ధేశ్వరానంద ఇటీవల నెల్లూరు నగరా నికి వచ్చారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని వేదాయపాళెంలోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయం వద్ద నుంచి పప్పులవీధిలోని దత్తాత్రేయ మఠం వరకు నిర్వహించిన శోభాయాత్ర కన్నుల పండు వగా జరిగింది. స్వామిని పూర్ణకుంభంతో స్వాగతించి మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. సౌభాగ్య సరస్వతి అమ్మ వారి వైభవోత్సవాల్లో భాగంగా ఆది, సోమవారాల్లో అమ్మవారికి విశేష పూజలు చేశారు. హోమాలు నిర్వహించి భైరవపూజ, బాలాత్రిపురసుందరి పూజలు నిర్వహిం చిన అనంతరం భక్తులనుద్దేశించి స్వామి వారు అనుగ్రహభాషణం చేశారు. సోమ వారంతో ఈ ఉత్సవాలు పూర్తయ్యాయి. ఆ రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా పీఠదేవతా పూజలు, హోమాలు, మహా పూర్ణాహుతి, మహా కుంభాభిషే కాలు, కలశోద్వాసన వైభవోపేతంగా జరిగాయి. సాయంత్రం నుంచి శ్రీ సౌభాగ్య సరస్వతి, శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహా స్వామి నగరోత్సవాన్ని వేడుకగా నిర్వ హించారు. తిరుపతి శ్రీశక్తి పీఠాధిపతి రమ్యానంద భారతి మహాస్వామి, కుర్తాళం పీఠం ఆస్థాన పండితులు మాచవోలు రమేష్‌శర్మ, కుర్తాళం పీఠం ప్రధాన పర్యవేక్షకులు మోచర్ల శశిభూషణ్, శ్రీ గురు దత్తాత్రేయ మఠం మేనేజర్ మాచవోలు అనూరాధతో పాటు హిమకుమారి, కామే శ్వరి, వి.లక్ష్మి, సాయిలక్ష్మి, జయంతి తదితరులు పాల్గొన్నారు.

# 10న డా.సూరం ఉపన్యాసం

నెల్లూరులోని పద్యకళా పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 10వతేదీ ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు టౌన్‌హాలు ప్రాంగణంలోని ఏసీహాలులో ప్రముఖ సాహితీవేత్త డా.సూరం శ్రీనివాసులు 'శృంగార నైషధము-అనువాద రీతి' అనే అంశంపై ఉపన్యసిస్తారని, సాహితీ వేత్తలు, సాహిత్యాభిమానులందరూ విచ్చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.







# స్నేహపూర్వక కలయిక



రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని జులై 5 వతేది మంగళవారం నెల్లూరులోని ఆయన స్వగృహంలో స్నేహపూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలుపుతున్న ప్రముఖ వ్యాపార వేత్త కోవూరు వాస్తవ్యులు అనపల్లి అశోక్ రెడ్డి.

# శ్రీసిటీలో.. మరో కొత్త పరిశ్రమ

- ‘పహార్పూర్ ప్యాకేజింగ్’ ప్రారంభం
- 150 కోట్లతో, 10 ఎకరల విస్తీర్ణంలో నిర్మాణం
- దేశంలో ఇది రెండవది, దక్షిణాదిన ఇదే మొదటిది



***అంతర్జాతీయంగా ప్రముఖ పారిశ్రామికవాడగా పేరొంది, ప్రఖ్యాతమైన దేశవిదేశీ పరిశ్రమలకు నిలయంగా ఉన్న శ్రీసిటీలో తాజాగా ఈనెల 6వ తేదిన మరో కొత్త పరిశ్రమకు ప్రారంభోత్సవం జరిగింది. ఎంతో ప్రఖ్యాతమైన పారిశ్రామిక సంస్థగా ఉన్న ‘పహార్పూర్ ప్యాకేజింగ్’ పరిశ్రమ దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా శ్రీసిటీలో ప్రారంభం కావడం విశేషం. దాదాపు 150 కోట్ల రూపాయల వ్యయంతో, 10 ఎకరాల విస్తీర్ణంలో నెలకొల్పిన ఈ ప్లాంట్ ద్వారా సుమారు 250 మందికి ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి.***

ఆహారం, పానీయాలు, టీ, కాఫీ, ఎడిబుల్ ఆయిల్‌తో పాటు, పెంపుడు జంతువుల ఆహారం, ఔషధాలు, గృహ, వ్యక్తిగత సంరక్షణ వినియోగ వస్తువుల ప్యాకేజింగ్‌లో ప్రఖ్యాతి గడించిన ‘పహార్పూర్ ప్యాకేజింగ్’కు తొలినుంచీ అధిక–నాణ్యతతో కూడిన సౌకర్యవంతమైన ప్యాకేజింగ్ మెటీరియల్‌ను అందించే పరిశ్రమగా పేరుంది. అలాంటి దిగ్గజ సంస్థ ఇప్పుడు శ్రీసిటీలో తన ఉత్పత్తులు ప్రారంభించనుంది. ‘పహార్పూర్ కూలింగ్ టవర్స్ (గ్రూపు’కు చెందిన పహార్పూర్ (3పి) ప్యాకేజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు ఈనెల 6వ తేది బుధవారం శ్రీసిటీలో ప్రారంభోత్సవం జరగడంతో శ్రీసిటీలో పండుగ వాతావరణం ఏర్పడింది. ఆ కంపెనీ కస్టమర్లు, శ్రీసిటీలోని పలు పరిశ్రమల ప్రతినిధుల సమక్షంలో పరిశ్రమ ఛైర్మెన్ గౌరవ్ స్వరూప్ ఈ కంపెనీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలో ఇది తమ మొట్టమొదటి పరిశ్రమ అని, దేశంలో రెండవదని అన్నారు. అధునాతన సాంకేతికత పరిజ్ఞానంతో, నూతన ఆవిష్కరణలతో ఈ ప్లాంట్ పనిచేస్తుందన్నారు. 150 కోట్లతో ప్లాంట్ నిర్మాణం జరిగిందని, రాబోయే 10 సంవత్సరాలలో సుస్థిర ప్యాకేజింగ్ ఉత్పత్తుల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని స్థాపించడానికి తమ పెట్టుబడిని రెట్టింపు చేయనున్నామని కూడా ఆయన చెప్పారు. ప్లాంట్ ఏర్పాటుకు శ్రీసిటీ అత్యంత అనుకూలమైన ప్రదేశమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తమ కస్టమర్‌ల నుండి వచ్చిన అద్భుతమైన ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే ఇక్కడ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి సంకల్పించామని తెలిపారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈ సందర్భంగా తన సందేశంలో పహార్పూర్ టీమ్‌కు అభినందనలు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఆ ప్లాంట్ ఏర్పాటుకు శ్రీసిటీని ఎంచుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. దేశంలో మరియు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పలు ఆహార, పానీయాలు, టీ, కాఫీ, ఎడిబుల్ ఆయిల్ తయారీదారులు విశ్వసిస్తున్న ప్రముఖ బ్రాండ్ ‘పహార్పూర్’ అని తెలిపారు. దీని ద్వారా శ్రీసిటీలోని పలు ఫుడ్ ప్రాసెసింగ్, పానీయాలు మరియు పలు రంగాల పరిశ్రమలకు కూడా ప్రయోజనం చేకూరుతుందన్నారు.



# జగన్ పాలనంతా..అవినీతి అక్రమాలే

## మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి విమర్శ



రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ పాలన అంతా అవినీతి, అక్రమాలతో, కక్షసాధింపులతోనే సరిపోతోందని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ప్రజలు మాత్రం సమస్యల భారంతో నానా బాధలు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 6న జిల్లాలోని ముత్తుకూరు మండలం తాళ్లపూడి గ్రామంలో ఆయన పర్యటించి ‘బాదుడే బాదుడు’ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు వైకాపా పాలనలోని అన్యాయాలను వివరించారు. మూడున్నరేళ్ల జగన్‌రెడ్డి పాలనలో ఎడాపెడా ధరల బాదుడు, పన్నుల మోత తప్ప రాష్ట్రానికి కానీ, ప్రజలకు కానీ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. వైకాపా ప్రజలకు శాపంగా మారిందని, మంత్రి కాకాణికి టిడిపివారిపై అక్రమ కేసులు పెట్టించడం, ధనార్జన, దోపిడీ తప్ప అభివృద్ధిపై ధ్యాస లేకుండా పోయిందని దుయ్యబట్టారు.

**తిరుపతి జిల్లా గూడూరు డివిజన్**

## విద్యార్థులు..

# ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

**- పొణకా దేవసేన**



గౌతమిని సత్కరిస్తున్న పొణకా దేవసేన

విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, ప్రతి విద్యార్థి సరైన లక్ష్యాలను ఎంచుకోవాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన తెలిపారు. గూడూరు పట్టణంలోని శివాని స్టడీ సర్కిల్ ఏపీఆర్ జేసీలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఇటీవల సత్కరించారు. గాదంశెట్టి గౌతమి మరికొంతమంది విద్యార్థినీ విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు శివకుమార్, శారద, శ్రీనివాసులు, గోపాల్‌యాదవ్, వాసు, ముని, హసీమ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా రంగంలో రాణించాలి

**- చేవూరు విజయమోహన్‌రెడ్డి**



ప్రతి ఒక్కరూ క్రీడారంగంలో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని వైకాపా నాయకుడు చేవూరు విజయమోహన్‌రెడ్డి అన్నారు. గూడూరు పట్టణంలోని బాల్‌బ్యాడ్మింటన్ స్టేడియంలో నిర్వహించిన పోటీలలో విజేతలకు 4వ తేదీ చేవూరు విజయమోహన్‌రెడ్డి, ప్రతినిధులు బహుమతులు అందజేశారు.

# ఏఐఐఇఏ 72వ వ్యవస్థాపక దినోత్సవం



ఏఐఐఇఏ 72వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ నెల 4వ తేదీ గూడూరులోని ఓం సాయిరాం చారిటీస్ వృద్ధులు వికలాంగుల ఆశ్రమంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి శశికిషోర్ దాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు డిబి శ్రీనివాసరావు, కార్యదర్శి శివకుమార్, ఉప కార్యదర్శి అశోక్‌కుమార్, ఎస్‌డి యాకబ్, వి.రామ్మోహన్ పాల్గొన్నారు.

# స్కూల్ టాపర్స్‌కు జెవివి బహుమతులు

ప్రభుత్వపాఠశాలలో చదివి స్కూల్ టాపర్స్‌గా నిలచిన విద్యార్థినీ విద్యార్థులకు పొణకా దేవసేనమ్మ దాతృత్వంతో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇటీవల చేతిగడియారాలు, మెమొంటోలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవసేనమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థినీవిద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ప్రతి సంవత్సరం జనవిజ్ఞాన వేదిక లాంటి సంస్థ ద్వారా బంగారు ఉంగరాలతో పాటు వాచీలు, మెమొంటోలు ఇస్తున్నానని అందుకు ప్రతిగా విద్యార్థులు కష్టపడి ఇష్టంతో బాగా చదివి మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకుని ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం జె.వి.వి వారు దేవసేనమ్మను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జె.వి.వి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, నారాయణ, సాయికిరణ్, పురుషోత్తం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయండి



గూడూరు పట్టణ పరిధిలో ఉన్న వేములపాలెం గ్రామంలోని గిరిజన కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని త్వరితగతిన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం బిజెపి ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. గూడూరు మున్సిపల్ శాఖ కార్యాలయంలో ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌కు బిజెపి నాయకులు వినతిపత్రం అందజేసి కార్యాలయం వద్ద నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణనాయుడు, బిందురెడ్డి, బిజెపి నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

# నిరాశ్రయులకు అన్నదానం



ఈ నెల 5వ తేదీ గూడూరు పట్టణం గమళ్ళ పాలెంలో ఉన్న మెప్మా మరియు మున్సిపాలిటీ సౌజన్యంతో నిర్వహిస్తున్న మై ఫ్రెండ్స్ అసోసియేషన్ వసతి గృహంలోని నిరాశ్రయులకు శ్రీకృష్ణ సేవాసమితి మరియు మయూరి స్వీట్స్ అధినేత రొటేరియన్ బి.శ్యామసుందరరావు దాతృత్వంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ఇటీవల గూడూరు డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి, క్లబ్ సభ్యులు, డిఆర్‌డబ్ల్యు ప్రిన్సిపాల్ హనుమంతరావు

# అగ్నిప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ సాయం



నెల్లూరు బివినగర్ సమీపంలోని అనగుంటలో ఇటీవల ప్రమాదవశాత్తు రెండు గుడిసెలు అగ్నికి ఆహుతి కాగా, ఆ సమాచారం తెలుసుకున్న రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి వెంటనే స్పందించి బాధితులకు తక్షణావసరమైన వంట సామాగ్రిని అందచేయాలని రెడ్‌క్రాస్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ టి.భాస్కర్‌రెడ్డికి తెలియచేయగా ఆ కమిటీ సభ్యులు వెనువెంటనే ఆ ప్రాంతాన్ని సందర్శించారు. పూర్తిగా నివాసాలు కాలిపోయిన పొట్లూరి రమణమ్మ, అనురాధను ఓదార్చి వారికి 32 పాత్రలతో కూడిన వంట సామగ్రి కిట్, తాత్కాలిక వసతి కోసం ఒక టార్పాలిన్ పట్ట, 2 దుప్పట్లు, 10 కేజీల బియ్యం, ఒక్కో కేజీ చొప్పున చింతపండు, కందిపప్పు, పెసరపప్పు, నూనె, చక్కర, గోధుమపిండి, ఉప్పు, బెల్లం, కారం, పసుపు ఇతర నిత్యవసర వస్తువులు అందజేశారు. డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ జి.వి.రవికుమార్, పి.శివప్రసాద్, జీవితకాల సభ్యులు సాయిరామ్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురూ మృతిచెందారు

- ఈత సరదా.. ప్రాణాలు తీసింది
- శోకసంద్రంగా జంగాలదొరువు



***సంగం మండలం పెరమన పంచాయతీ పరిధిలోని జంగాల దొరువు గ్రామానికి చెందిన ఆరుగురు సరదాగా పెన్నా నదిలో ఈతకు దిగారు. ఆ ఆరుగురిలో ఒక్కరికి కూడా ఈత రాదు. అయినా ఏమీ కాదులే అనుకుంటూ నది లోకి దిగేసి ప్రమాదవశాత్తూ అక్కడున్న పెద్దగుంతలోకి జారిపోయారు. ఈ దుర్ఘటనలో ముగ్గురు యువకులు గల్లంతు కాగా, మిగిలినవారు ఎలాగో బయటపడ్డారు. ఈనెల 3వ తేది మధ్యాహ్నం గల్లంతైన ఆ ముగ్గురి మృతదేహాలను 4వ తేదీన వెలికితీశారు. శవాలుగా మారిన కన్నబిడ్డలను చూసి వారి తల్లితండ్రుల రోదన అంతా ఇంతా కాదు. మృతిచెందిన ముగ్గురూ ఒకే కుటుంబానికి చెందినవారు కావడంతో వారి బంధువుల రోదనలతో జంగాలదొరువు శోకసంద్రంగా మారింది.***

జంగాలదొరువు గ్రామానికి చెందిన డి.భవానిప్రసాద్ (బుచ్చిలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు), చెన్నైలో డిగ్రీ సెకండియర్ చదువుతున్న గుర్రం చరణ్, గుర్రం శ్యామ్‌ప్రసాద్‌లు ముగ్గురూ అదే గ్రామానికి చెందిన గుర్రం భార్గవ్, సిహెచ్ వంశీలతో పాటు, ఇటీవలే విశాఖ నుంచి వచ్చిన అప్పలరాజుతో కలసి సంగం ఆనకట్టవద్ద పెన్నానదిలో ఈతకు వెళ్ళారు. ఈత రాకపోవడంతో ఒకరికొకరు చేతులు పట్టుకుని నదిలో నడుచుకుంటూ ముందుకు వెళ్ళారు. అక్కడ ఒక పెద్దగుంత ఉండడంతో గమనించలేక అడుగేసి మునిగిపోయారు. ప్రసాద్, చరణ్,శ్యామ్‌లు మరింత లోతుకు వెళ్ళిపోయి గల్లంతైపోయారు. మిగిలినవారు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ సమాచారంతో పోలీసులు, అధికారులు, కుటుంబసభ్యులు అందరు ఘటనాస్థలానికి వచ్చి గాలింపు చేపట్టారు. స్థానిక మత్స్యకారులు, అగ్నిమాపక సిబ్బంది గాలించినా గల్లంతైన వారి ఆచూకీ దొరకలేదు. ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి వెంటనే స్పందించి గల్లంతైన వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. రోదిస్తున్న తల్లితండ్రులను ఓదార్చారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌తో సంప్రదించి కృష్ణపట్నంలోని ప్రత్యేక రక్షణ బృందాన్ని రంగంలోకి దింపారు. వారితోపాటు ఆత్మకూరు ఆర్డీఓ బాపిరెడ్డి, సిఐ కోటేశ్వరరావు, బుచ్చి-సంగం ఎస్ఐలు వీరప్రతాప్, శ్రీనివాసరావుతో పాటు అగ్నిమాపక సిబ్బంది సోమవారం పెద్దఎత్తున గాలింపు చర్యలు చేపట్టి ఎట్టకేలకు ఆ ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు. గుర్రం శ్యాంప్రసాద్, గుర్రం చరణ్‌లు అన్నదమ్ముల బిడ్డలు కాగా, భవాని ప్రసాద్ వారి చెల్లెలి కుమారుడు. ఒకే కుటుంబానికి చెందిన వీరి ముగ్గురి మృతి గ్రామస్తులను కంటతడిపెట్టించింది.

# చార్జీల పెంపుపై.. కావలిలో జనసేన ఆందోళన

ఆర్టీసి బస్సు చార్జీలను ఇటీవల రాష్ట్రప్రభుత్వం పెంచడంపై కావలి జనసేన ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. కావలి ఆర్టీసి బస్టాండ్ వద్ద జరిగిన ఈ ఆందోళనలో జనసేన జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య, పట్టణ అధ్యక్షులు పి.సాయి తదితరులు పాల్గొని మాట్లాడుతూ వైకాపా పాలనలో అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగిపోయి సామాన్యుల జీవితం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోలు, డీజిల్, విద్యుత్‌చార్జీలు పెరిగిపోవడంతో అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఇకనైనా పెంచిన ధరలను, ఆర్టీసి చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

## మూడేళ్ళ వైకాపా పాలనలో..

# ప్రజలకు అన్నీ అవస్తలే

**- జనసేన జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్**



మూడేళ్ళ వైకాపా పాలనలో ప్రజలకు అన్నీ అవస్తలేనని జనసేన జిల్లా అధ్యక్షులు చెన్నారెడ్డి మనుక్రాంత్ విమర్శించారు. ఈనెల 4న నెల్లూరులో కలెక్టరేట్‌కు వచ్చి పలు సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం రైతులకు సకాలంలో డబ్బు చెల్లించకపోవడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, దీంతో సాగునీరు పుష్కలంగా ఉన్నా రైతులు సేద్యం చేసేందుకు సాహసించడం లేదని అన్నారు. ఆర్టీసి చార్జీలను పెంచడంతో ప్రయాణీకులు అదనపు వ్యయాన్ని భరించాల్సి వస్తోందన్నారు. అర్హత కలిగిన వారు డబ్బు చెల్లించినా వారికి టిడ్కో ఇళ్ళు కేటాయించకపోవడం, నిరుపేద ముస్లిమ్‌లకు వివాహసందర్భంగా ఇచ్చే ఆర్థికసాయాన్ని నిలిపివేయడం సముచితం కాదంటూ పలు అంశాలపై కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. వైకాపా మూడేళ్ళ పాలన ప్రజలకు శాపంగా మారిందని ఆయన దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, జిల్లా అధికార ప్రతినిధి దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి కొట్టె వెంకటేశ్వర్లు, హేమచంద్ర, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాదాత డిఆర్..

# ఆశయాల బాటలో నడుద్దాం

**- తనయుడు దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి**



విద్యాదాత, విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకులు డా. దొడ్ల రామచంద్రారెడ్డి (డిఆర్) ఆశయాల బాటలో నడుద్దామని, వారి లక్ష్యాలను కొనసాగించడమే తమ ప్రధాన కర్తవ్యమని డిఆర్ తనయుడు విశ్వోదయ విద్యాసంస్థల రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 4న డిఆర్ 94వ జయంతి సందర్భంగా కావలిలోని జవహర్‌భారతి కళాశాలలో డిఆర్ స్థూపం వద్ద జవహర్‌భారతి టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డిఆర్ తన జీవితమంతా విద్యాసంస్థల అభివృద్ధికే కృషిచేసి వేలాదిమంది పేద విద్యార్థులకు విద్యను అందించారని అధ్యాపకులు కొనియాడారు. జవహర్‌భారతి కళాశాల కరెస్పాండెంట్ వి.సుధాకర్‌రెడ్డి, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డా.పి.సుబ్రహ్మణ్యంనాయుడు, విశ్రాంత ప్రిన్సిపాల్ డా.ఆర్. మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులందజేశారు.

# ప్రజల కోసం పోరాడతాం

**- సిపిఐ నేత పముజుల దశరథరామయ్య**

ప్రజల సమస్యల సాధన కోసం అలుపెరుగని పోరాటం చేస్తామని సిపిఐ సీనియర్ నాయకుడు పముజుల దశయ్య చెప్పారు. ఈనెల 3న నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరు గ్రామంలో సిపిఐ రూరల్ మండల 17వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా పముజుల మాట్లాడుతూ కమ్యూనిస్టులకు జనాదరణ పెరుగుతోందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, వి.రామరాజు, సర్పంచ్ తిరువీధుల పోలయ్య, చల్లా నరసయ్య, తుళ్ళూరు నరసయ్య, రాజగోపాల్, హరి పాల్గొన్నారు.

# టూకీగా...



## జిల్లాకు కొత్త డిఎఫ్ఓ వచ్చారు

నెల్లూరుజిల్లా అటవీ శాఖ అధికారి (డిఎఫ్ఓ)గా పని చేస్తున్న షణ్ముఖకుమార్ ఇటీవల తిరుపతికి బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో ఒంగోలులో సామాజిక అటవీ విభాగం డిఎఫ్ఓగా పనిచేస్తున్న మహబూబ్‌బాషాను ఇన్‌చార్జి అటవీశాఖ అధికారిగా నియమించారు. ఈనెల 5న మహబూబ్‌బాషా నెల్లూరులో బాధ్యతలు చేపట్టారు.

## బుచ్చికి కొత్త కమిషనర్

బుచ్చి నగర పంచాయతీ కమిషనర్‌గా ఉన్న శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నాయుడుపేట మునిసిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులిచ్చింది.

## 20 టన్నుల రేషన్ బియ్యం దొరికిపోయింది

ఒంగోలు నుంచి చెన్నైకి అక్రమంగా తరలిపోతున్న 20 టన్నుల రేషన్‌బియ్యాన్ని నెల్లూరుజిల్లా మనుబోలు మండలంలోని కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు వద్ద అధికారులు పట్టుకున్నారు. ఈ నెల 5న విజిలెన్స్ అధికారులు, పౌరసరఫరాలశాఖ అధికారులు వాహనాలను తనిఖీ చేస్తుండగా అక్రమ రేషన్ బియ్యం లారీ దొరికిపోయింది. లారీని, బియ్యాన్ని సీజ్‌చేసి అక్రమార్కులపై అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు.

## 5 నెలలుగా జీతాలు లేవు

తమకు 5 నెలలుగా జీతాల్లేవని ఆవేదన వ్యక్తం చేస్తూ నెల్లూరు ప్రభుత్వ వైద్యకళాశాలలోని పలువురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 5న వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం సమర్పించుకున్నారు. యూనియన్ నాయకులు ఎన్.సతీష్‌కుమార్, షేక్ సంధానిబాషా, కె.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు విద్యుత్ ఏఇలకు ప్రమోషన్ వచ్చింది

నెల్లూరు సర్కిల్ విద్యుత్‌శాఖలో వెస్ట్ సెక్షన్-1లో పనిచేస్తున్న ఏఇ పరిశుద్ధరావుకు ఏడిఇగా ప్రమోషన్ ఇచ్చి విజయవాడకు బదిలీ చేశారు. గూడూరు స్టోర్ ఏఇగా ఉన్న కిరణ్‌కుమార్‌కు అదేవిధంగా డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతినిచ్చి విజయవాడకు బదిలీ చేస్తూ విద్యుత్‌శాఖ సిఎండి హరినాథ్ రావు ఈనెల 5న ఉత్తర్వులిచ్చారు.

## ట్రాక్టర్ అతివేగానికి.. మూగజీవాలు బలి

ఓ ట్రాక్టర్ అతివేగంగా వెళ్తూ రోడ్డుపై 15 గొర్రెలపైకి దూసుకువెళ్లడంతో ఆ మూగజీవాలన్నీ అక్కడికక్కడే మరణించాయి. ట్రాక్టర్ కూడా అదుపుతప్పి కొంతదూరంలో బోల్తా పడింది. అనంతసాగరం మండలం వెంకటరెడ్డిపల్లి వద్ద ఆత్మకూరు-సోమశిల రహదారిపై ఈనెల 5న ఈ దుర్ఘటన జరిగింది. రోడ్డుపై చచ్చిపడివున్న గొర్రెలను చూసి వాటి యజమాని వెంకటేశ్వర్లురెడ్డి గోడు అంతా ఇంతా కాదు. ఈ సమాచారం తెలిసి, పోలీసులు వచ్చి విచారణ చేపట్టారు.

## జిల్లాలో అక్కడక్కడా వానజల్లులు

ఇది వానాకాలమైనా ఎండాకాలంలాగే మండిపోతూ జనం సెగ దెబ్బకు అల్లాడిపోతున్నారు. ఎట్టనో వరుణుడి కరుణతో ఈనెల 5న నెల్లూరు నగరంతో పాటు రాపూరు, కోవూరు తదితర మండలాల్లో కూడా చిరుజల్లులు కురవడంతో జనానికి కాస్త ఉపశమనం అనిపించింది. అయితే జిల్లాలో ఎక్కడా డ్రైనేజీ సౌకర్యాలు సరిగ్గా లేకపోవడంతో చిన్న వానకే రోడ్లన్నీ మురుగుగుంటలుగా మారి ప్రజలు అవస్తలు పడ్డారు. ఇక దోమల సంగతి వేరే చెప్పనక్కరలేదు.

## విద్యుత్‌షాక్‌తో మరణించిన గోవులు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న చెత్తను తింటున్న నాలుగు ఆవులు ఒక్కసారిగా విద్యుత్‌షాక్ కొట్టి మరణించాయి. ఈనెల 5న ఆత్మకూరులో ఈ ఘోరం జరిగింది. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచెలు లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని అంటూ, గోవులు విద్యుత్‌షాక్‌తో మరణించడం పట్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# యుగపురుషుడు

(మొదటి పేజీ తరువాయి)

భరతజాతి దాస్యశృంఖలాలను తెగదెంచడానికి, భరతమాత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో విలసిల్లడానికి కరదుగట్టిన బ్రిటిష్ నిరంకుశ పాలకులను ఎదిరించి పోరాడిన సాహసి, విప్లవ తపస్వి, స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు. అంతేకాదు గిరిజనుల హక్కుల కోసం ప్రాణాలకు తెగించి ఉద్య మించిన నాయకుడు, ఆదివాసీలు, గిరిజనుల్లో విప్లవజ్యోతి వెలిగించి గిరిజనులకు ఆరాధ్యుడైన మహనీయుడాయన. తెలుగు జాతి దేశభక్తిని, త్యాగనిరతిని లోకానికి చాటిన సాహసయోధుడు అల్లూరి. ఒక్కమాటలో చెప్పాలంటే.. భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలోనే ఆయనో మహోజ్వల శక్తి. ఆయన పోరాటం స్వాతంత్ర్య పోరాటంలో మరచిపోలేని ఘట్టం.

1897 జులై 4న జన్మించి, యువకప్రాయంలోనే 1924 మే 7న వీరస్వర్గం పొందిన తెలుగుజాతి ముద్దుబిడ్డ అల్లూరి. చిన్నతనం నుంచి దైవభక్తి, దేశభక్తితో ఎదిగాడు. అమాయకులైన గిరిజనులు తెల్లదొరల చేతిలో అత్యంత దారుణమైన అరాచకాలకు, అత్యాచారాలకు, అనేకరకాల దురాగతాలకు గురవుతుండడం చూసి ఆవేదనకు గురయ్యేవారు. ఏదేమైనా సరే..మన్యం ప్రజల కష్టాలు తీర్చాలని నిర్ణయించుకుని బ్రిటిష్ నిరంకుశులను ఎదిరించడానికి యుద్ధవిద్యలు నేర్చి విల్లంబులు చేతపట్టాడు. అప్పట్లో అత్యంత స్వల్ప వనరులతోనే బలీయమైన బ్రిటిష్ పాలకులను గడగడ వణికించాడు. చివరికి ఆ కఠినాత్ముల తుపాకులకే ప్రాణాలను ధారపోశాడు.

అల్లూరి వీరగాథ అప్పట్లో తెలుగునాట దశదిశలా మారు మ్రోగుతుండేది. నాటికలు, నాటకాలు, ఏకపాత్రాభినయాల్లో అల్లూరి చరిత్ర ఎంతో ప్రఖ్యాతంగా వినిపించేది. బుర్రకథ పితామహుడుగా ఖ్యాతిగాంచిన నాజర్ అత్యద్భుతంగా ప్రదర్శించే 'అల్లూరి సీతారామరాజు' బుర్రకథ ప్రజల్లో ఇంకా బాగా ప్రచారంలో ఉండేది.

### భావితరాలకు వెలుగుబాట కావాలి

ఆ దేశభక్తుని సాహసపోరాటానికి, త్యాగనిరతికి గుర్తుగా పార్లమెంట్‌లోనూ అల్లూరి విగ్రహాన్ని ఆవిష్కరించాలి. అల్లూరి దేశభక్తిని, వీరచరితను భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేందుకు దేశవ్యాప్తంగా అన్ని భాషల్లో పాఠ్యాంశాల్లోనూ ప్రవేశపెట్టాలి. కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రప్రభుత్వాలు దేశం నలు చెరగులా ఉన్న ఆదివాసీలు, గిరిజనుల జీవితాల్లో వెలుగులు పండించేందుకు బృహత్తరమైన పథకాలను అమలు చేసి వారి అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషిచేయాలి. అదే ఆ మహనీయునికి అసలైన నివాళి.

'సూపర్‌స్టార్'
# కృష్ణను మరిచారు



అల్లూరి సీతారామరాజు చరిత్రను వెండితెరకు ఎక్కించి అశేషాంధ్రప్రజానీకం ప్రశంసలందుకున్న అరుదైన ఘనత సూపర్‌స్టార్ కృష్ణకే దక్కుతుంది. కృష్ణ హీరోగా 1974లో తొలి తెలుగు కలర్ సినిమా స్కోప్ చిత్రంగా 'అల్లూరి సీతారామరాజు' చిత్రం విడుదలైంది. అందులోనూ అది కృష్ణ 100వ చిత్రం కావడం, 19 కేంద్రాల్లో 100 రోజులు విజయవంతంగా ప్రదర్శితమై రికార్డు సాధించడం విశేషం. ఆంధ్ర దేశాన్ని ఉర్రూతలూగించిన చిత్రమది. అంతేకాదు, 1974 సంవత్సరానికి ఉత్తమ చిత్రంగా ఎంపికై ప్రతిష్ఠాత్మకమైన నంది అవార్డుతో పాటు, ఆఫ్రో-ఏషియన్ చలనచిత్రోత్సవంలో ప్రదర్శితమై ప్రత్యేక బహుమతిని కూడా అందుకుంది. ఆ చిత్రంలోని 'తెలుగు వీర లేవరా... దీక్షబూని సాగరా' అనే పాటను రాసింది మరెవరో కాదు.. మహాకవి శ్రీశ్రీ. ప్రముఖ గాయకులు ఘంటసాల, రామకృష్ణ ఆ గీతాన్ని ఎంతో ఉద్వేగంతో గానం చేశారు. దేశభక్తి ప్రబోధాత్మకమైన ఆ పాట శ్రీశ్రీకి ఉత్తమ గీత రచయితగా పేరు తేవడమే కాక జాతీయపురస్కారాన్ని కూడా తెచ్చిపెట్టింది. ఆ పాటే..అల్లూరి విగ్రహావిష్కరణ సభలో ప్రధాని నోట స్ఫూర్తిదాయకమైన మాటలుగా పరవళ్ళుతొక్కింది. ప్రధాని ప్రసంగంలో తొలి మాటలు.. ఆ పాటలోని తొలి చరణంలోని పదాలే కావడం మరో విశేషం. తెలుగుజాతి గర్వించదగ్గ మహావీరుడైన అల్లూరి సీతారామరాజు జీవితచరిత్రను ఆధారం చేసుకుని ఆ సినిమా నిర్మించారు. సీతారామరాజు పాత్రలో నటశేఖర కృష్ణ అత్యద్భుతంగా నటించి ఆ మహనీయుని చరిత్రకు, రూపానికి తెలుగువారి గుండెల్లో ప్రాణప్రతిష్ట చేశారు. కృష్ణ సినీజీవితంలోనూ ఈ చిత్రం ఒక మైలురాయిగా నిలిచింది. అలాంటి చరిత్రాత్మకమైన సినిమాను నిర్మించి, అపర సీతారామరాజుగా పేరొందిన హీరో కృష్ణను ఈ సందర్భంగా విస్మరించకుండా సాదరంగా స్వాగతించి సత్కరించి ఉంటే మరింత బావుండేది. సభకు ఇంకా నిండుదనం వచ్చి ఉండేది. తెలుగు సినీపరిశ్రమకు కూడా అది మరింత గౌరవంగా ఉండేది. ఇప్పటికైనా ఆ కొరత లేకుండా వారిని గౌరవించ గలిగితే ప్రభుత్వానికి కూడా మంచిపేరు వస్తుంది.

# ఉద్యమ స్ఫూర్తికి.. అజరామర కీర్తి

(మొదటి పేజీ తరువాయి)

కందుకూరి వీరేశలింగంపంతులు, పొట్టి శ్రీరాములు వంటి వారు జన్మించిన పుణ్యభూమి ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఆంగ్లేయుల తుపాకులకు ఎదురొడ్డి పోరాడిన గొప్ప యోధుడని, దేశం కోసం బలిదానాలు చేసిన ఆ యోధులందరి కలలు ఈ అమృతోత్సవ్ కాలంలో సాకారం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ సందర్భంగా ప్రధానికి ఆంధ్రలో అపూర్వ స్వాగతం లభించింది. విగ్రహావిష్కరణ సభ ఆద్యంతం అద్భుతంగా సాగి విజయవంతమైంది. ముఖ్యమంత్రి జగన్ ప్రధాని మోడీకి రాష్ట్రప్రభుత్వం తరపున శ్రీ సీతారాముల పట్టాభిషేకం చిత్రాన్ని జ్ఞాపికగా బహుకరించారు. ఎంతో సంతోషంగా ప్రధాని ఆ జ్ఞాపికను అందుకున్నారు. అనంతరం అల్లూరి వీరత్వానికి గుర్తుగా ప్రధాని చేతికి విల్లు బాణాన్ని కూడా ముఖ్యమంత్రి అందించడం, వాటిని ప్రధాని చేతపట్టి నిలవడం అందరికీ ఆనందం కలిగించింది. ప్రధాని, సిఎంలు ఇద్దరూ ఎంతో ఆత్మీయంగా మాట్లాడుకోవడం సభికులను ఆకట్టుకుంది. ఏదేమైనా ఈ కార్యక్రమంతో భరతమాత ముద్దుబిడ్డ, తెలుగుజాతి కన్నబిడ్డ..అల్లూరి సీతారామరాజుకి మహోన్నతమైన గౌరవం లభించినట్లయింది.

### అగ్నికణం..అల్లూరి - ముఖ్యమంత్రి వైఎస్ జగన్

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను పణంగాపెట్టిన ఎందరో త్యాగధనులు, పోరాట యోధుల్లో అల్లూరి ఒక మహా అగ్నికణమని ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆ మహనీయుడి ఘనతను గుండెల్లో పెట్టుకున్నాం కాబట్టే ఆయన నడయాడిన గడ్డకు 'అల్లూరి సీతారామరాజు జిల్లా' అని నామకరణం చేశామన్నారు. అడవిలోనూ అగ్గి పుట్టించిన ఆ యోధుడు తరతరాలకు సందేశమిచ్చేలా బతికారని, చిన్నవయసులోనే ప్రాణత్యాగం చేసిన ఆ మహనీయుడిని తెలుగుజాతి ఎన్నటికీ మరచిపోదని అన్నారు. దేశం కోసం, అడవిబిడ్డల కోసం తనను తాను అర్పించుకున్న ఆ మహావీరుడికి వందనం అన్నారు. 'అమర్‌రహే అల్లూరి సీతారామరాజు' అంటూ ముఖ్యమంత్రి ఆ స్వాతంత్ర్యయోధునికి జేజేలు పలికారు.

### దేశవ్యాప్త ఖ్యాతి - మెగాస్టార్ చిరంజీవి

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 30 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం ద్వారా ఆ మహావీరుని చరిత్ర దేశవ్యాప్తంగా మరింత ఖ్యాతి పొందుతుందని, అద్భుతమైన ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. ఈ సందర్భంగా వేదికపైకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌ను చిరంజీవి ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని తన సంతోషాన్ని వెల్లడించారు. అల్లూరి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రధాని మోడీ, సిఎం జగన్‌లతో పాటు రాష్ట్ర గవర్నర్ బిశ్వమోహన్ హరిచందన్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కె రోజాతో పాటు, బిజెపి నాయకులు సోము వీర్రాజు, పురందేశ్వరి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# కొత్త జేసీ కూర్మనాథ్..
# బాధ్యతలు చేపట్టారు



నెల్లూరు జిల్లాకు కొత్త జాయింట్ కలెక్టర్‌గా రోణంకి కూర్మనాథ్ ఈనెల 6న బాధ్యతలు చేపట్టారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించిన తర్వాత మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని, కలెక్టర్ చక్రధర్‌బాబును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. పార్వతీపురం ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆయన్ను ప్రభుత్వం ఉద్యోగోన్నతిపై నెల్లూరు జేసీగా నియమించిన విషయం తెలిసిందే. ఇక్కడ జేసీగా పనిచేస్తున్న హరేందిరప్రసాద్‌ను వైయస్ఆర్ ఆరోగ్యశ్రీ అడిషనల్ సిఇఓగా నియమించారు.

కూర్మనాథ్ స్వస్థలం శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం గంగారాం గ్రామం. 2007లో పార్వతీపురం ఐటిడిఏలో అకౌంట్స్ అధికారిగా ఉద్యోగప్రస్థానం ప్రారంభించి ఆ తర్వాత గ్రూప్-1లో ఉత్తీర్ణులై ఆర్డీఓ అయ్యారు. నర్సీపట్నం, కర్నూలు, అనంతపురం, పెద్దాపురంలలో ఆర్డీఓగా విధులు నిర్వహించారు. అనంతరం చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాల్లో డ్వామా పీడీగా, విజయనగరం జిల్లాలో జేసీ-2గా పనిచేశారు. గత ఆగస్టులో పార్వతీపురం ఐటిడిఏ పిఓగా చేరారు. తాజాగా నెల్లూరుజిల్లా జేసీగా నియమితులయ్యారు. జిల్లాలోని పలువురు అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. కొత్త జేసీ కూర్మనాథ్‌కు 'లాయర్' శుభాకాంక్షలు!

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ
# దేశభక్తి స్ఫూర్తిదాయకం

### - జయంతి సభలో బిజెపి నాయకులు



భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు, భారత రాజ్యాంగ పరిషత్ సభ్యుడు, దేశ పరిశ్రమల శాఖకు తొలి మంత్రి డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు ఈనెల 6న నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో ఘనంగా జరిగాయి. బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలను గుర్తు చేసుకున్నారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు భరత్ కుమార్‌యాదవ్ మాట్లాడుతూ దేశ సమగ్రతకోసం తన ప్రాణాలను అర్పించిన దేశభక్తుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని, ఆయన సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. నేటి తరం యువత ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, కాకు విజయలక్ష్మి, బి.శ్రీనివాసులు, విజయకుమార్, రాజేశ్వరమ్మ, మధు, రాధా కృష్ణగౌడ్, చైతన్య, అశోక్‌నాయుడు, ప్రసన్నమ్మ, పెంచలయ్య తదితరులు పాల్గొని శ్యామ్‌ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# ప్లాస్టిక్.. మానవాళి మనుగడకే ముప్పు

### - అవగాహన సదస్సులో శ్రీసిటీ డీఎస్పీ జగదీష్‌నాయక్



ప్లాస్టిక్ వినియోగం వల్ల మానవాళి మనుగడకే ముప్పు వాటిల్లుతుందని, ప్లాస్టిక్ వాడకాన్ని వెంటనే మానుకోవాలని శ్రీసిటీ డీఎస్పీ జగదీష్‌నాయక్ చెప్పారు. శ్రీసిటీ ఫౌండేషన్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 5న ట్రేడ్ సెంటర్‌లో ప్లాస్టిక్ వినియోగం అరికట్టడంపై అవగాహనా సదస్సు జరిగింది. శ్రీసిటీ పరిసర గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, దుకాణదారులు, భోజనశాలల నిర్వాహకులు, గ్రామస్థులు ఇందులో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఎస్పీ జగదీష్‌నాయక్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని ఎలా తగ్గించాలన్న దానిపై పలు సూచనలు చేశారు. ప్లాస్టిక్ రహిత శ్రీసిటీకి ఈ ప్రాంతవాసులు సహకరించాలని ఆయన కోరారు. జూలై1 నుంచి భారతప్రభుత్వం పలు రకాల ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై నిషేధం విధించిందని తెలిపారు. ప్లాస్టిక్‌కు బదులుగా గుడ్డ సంచులు, ఆకుల ప్లేట్లు, పేపర్ స్ట్రాలు, పేపర్ గ్లాసులు తదితరాలను వాడుకోవాలని సూచించారు. ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి, శ్రీసిటీ సెక్యూరిటీ హెడ్ రమేష్, శ్రీసిటీ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్అండ్‌బికి నూతన ఎస్ఇ



జిల్లా రహదారులు భవనాల శాఖ (ఆర్అండ్‌బి)కు నూతన ఎస్ఇగా గుంటూరులో ఎస్ఇగా ఉన్న మాధవి సుకన్యను నియమించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె ఇక్కడ నియమితులయ్యారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈనెల 6న నెల్లూరులోని ఆర్అండ్‌బి సర్కిల్ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఇ)గా ఆమె బాధ్యతలు స్వీకరించారు.

### నాలుగు నెలలైనా..

# ఎక్కడి పనులు అక్కడేనా?

## అధికారుల అలక్ష్యంపై జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అసంతృప్తి





నెలలు గడుస్తున్నా ప్రజల ప్రయోజనం కోసం తలపెట్టిన పనులను చేయకపోవడం ఏమిటంటూ జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధికారుల తీరు పట్ల మండిపడ్డారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా మంజూరైన అభివృద్ధి పనులను సత్వరమే చేపట్టి పూర్తిచేసే దిశగా దృష్టి సారించాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈనెల 5న నగరంలోని నూతన జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆధ్వర్యంలో జిల్లా ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయం, విద్య,వైద్య, స్త్రీ సంక్షేమం, సాంఘిక సంక్షేమం తదితర అంశాలపై 7 స్థాయి సంఘాల సమావేశాలు జరిగాయి. కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులతో ఆమె ఈ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, రహదారులు భవనాల శాఖల పరిధిలో మంజూరైన వివిధ అభివృద్ధి పనులు నాలుగు నెలలైనా ఇంకా చేపట్టకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎందుకింత ఆలస్యం చేస్తున్నారని ఆమె అధికారులను నిలదీశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నెల్లూరు గ్రామీణ మండలంలో మంజూరు చేసిన పనులను మరల విభజించే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నిస్తూ, వెంటనే వాటిని రద్దు చేయాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులు ప్రతిపాదనలు పంపినప్పుడు వాటిని ఉన్నతాధికారులు సరిగా పరిశీలించి సిఫారసు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఓ ఇ.వాణి, అకౌంట్స్ అధికారి వసుంధర, డ్వామా పి.డి తిరుపతయ్య, పంచాయతీరాజ్ ఎస్ఇ సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్.ఇ. రంగవరప్రసాద్, ఐటీడీఏ పిఓ శ్రీమతి మందా రాణి, ఎస్సీ సంక్షేమం సాధికారత అధికారి రమాదేవి, బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య, బి సి కార్పొరేషన్ ఇ.డి బ్రహ్మానందరెడ్డి, వృద్ధులు దివ్యాంగుల సంక్షేమశాఖ ఏ.డి నాగరాజకుమారి తదితర అధికారులు, పలువురు జడ్పీటిసిలు పాల్గొన్నారు.

# గ్రంథాలయాల్లో పుస్తకాల డిజిటలైజేషన్

## ఛైర్‌పర్సన్ దొంతు శారద



జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో 'డిజిటలైజేషన్ ఆఫ్ బుక్స్' కార్యక్రమాన్ని చేపట్టడంతో పాటు పాఠకులకు ఇబ్బంది లేకుండా అవసరమైన టేబుల్స్, కుర్చీలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన బడ్జెట్ ఆమోదం కోసం ఈనెల 6న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ కమిటీ సమావేశం జరిగింది. బడ్జెట్‌కు అనుగుణంగా చేపట్టాల్సిన పనులు, తీసుకోవాల్సిన అనుమతులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లూరుజిల్లా కేంద్ర గ్రంథాలయానికి 3కోట్ల రూపాయలతో నూతన భవన నిర్మాణం చేపట్టడం జరిగిందని, నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజ, సూపరింటెండెంట్ ప్రసాద్, వయోజన విద్య, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ

జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అధికమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఈనెల 5న నెల్లూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో చెప్పారు. యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, మెటీరియల్ పేరుతో 3 నుంచి 14 వేల రూపాయల దాకా గుంజుకుంటున్నారని, అధికారులు వెంటనే ఈ దోపిడీని నియంత్రించాలని కోరారు.

### మన్యం వీరుని సాక్షిగా...

# 'రఘు రామాయణం'

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం అనగానే ఇప్పటి దాకా గుర్తుకు వచ్చేది చేపల చెరువులు, క్షత్రియ యువత దూకుడు.

ఇక ముందు, భీమవరం అనగానే, గుర్తుకు వచ్చేది అల్లూరి సీతా రామరాజు 30 అడుగుల కాంస్య విగ్రహం. భీమవరంలో ఆ విప్లవజ్యోతి కాంస్య విగ్రహం నెలకొల్పాలనే ఆలోచనతో పాటు దానిని సాక్షాత్తు దేశ ప్రధానితో ఆవిష్కరింపచేయాలనే ఆలోచన వచ్చిన వారికి పాదాభివందనాలు.

2022, జులై 4వ తేదీ అల్లూరి 125వ జన్మదినం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భీమవరం వచ్చి ఆ మహనీయుని కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. (ఆ విగ్రహం దగ్గర మన నేతలు గ్రూప్ ఫోటో కోసం నిలబడిన దృశ్యం చూస్తుంటే - వారంతా సీతారామ రాజు మోకాలి వరకే వచ్చారు.)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ ఆవిష్కరణ వేడుకను చిరస్మరణీయంగా నిర్వహించాలని నిర్ణయించారు.

ఆయన అధికారం చేపట్టిన తరువాత, మొదటిసారిగా ప్రధాని మోడీ రాష్ట్రానికి రావడంతో జగన్ పూర్తిస్థాయిలో ఈ కార్యక్రమంతో మమేకమయ్యారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని కూడా పురమాయించి ఆ కార్యక్రమంలో నిమగ్నం చేయించారు.

తనకు ఇంతటి ప్రతిష్టాత్మకమైన కార్యక్రమానికి నిత్య అసమ్మతి వాదిగా ఢిల్లీ కేంద్రంగా రేయింబవళ్ళు జగన్‌పై (అంటే విజయసాయిరెడ్డి అని కూడా) మీడియా (సోషల్ మీడియాతో కలుపుకుని) యుద్ధం చేస్తున్న ఎం.పీ రఘు రామకృష్ణ రాజును దూరం పెట్టాలని జగన్ నిర్ణయించి ఉంటారు. అయితే, 'అది నా నియోజక వర్గం. ప్రధాని కార్యక్రమంలో ఎంపీగా పాల్గొనే హక్కు నాకు ఉంది. ప్రోటోకాల్ ప్రకారం కూడా నేనూ పాల్గొనాలి' అంటూ లా పాయింట్ తీసిన రఘు రామకృష్ణ రాజు.. భీమవరం రావడానికి విశ్వప్రయత్నం చేశారు. అందుకు అవసరమైన పలుకుబడి ఆయనకు ఢిల్లీలో ఉంది. రాజనాథ్‌సింగ్ లాంటి కేంద్ర మంత్రులు కొందరు ఆయనకు స్నేహితులు. ప్రధాని ఆయనను వ్యక్తిగతంగా గుర్తుపడతారు. ఆయన ఏదైనా విన్నపం చేస్తే, ప్రధాని కార్యాలయం తక్షణమే స్పందిస్తుంది. అడిగిన వెంటనే, ఆయనకు గతంలో 'Y' కేటగిరీ భద్రత ఇచ్చారు. 'నేను ప్రధాని కార్యక్రమానికి భీమవరం వెళ్ళాలి. అదనపు భద్రత ఇవ్వండి' అని రఘు రామరాజు అడిగీ అడగ్గానే Zప్లస్ కేటగిరీ ఇచ్చారు. దేశంలో ఇదే అత్యున్నత భద్రతా వ్యవస్థ. దీనికి పైన, ప్రధాని భద్రతా వ్యవస్థ ఎస్పీజీ మాత్రమే ఉంది.




అంతటి శక్తివంతమైన జడ్‌ప్లస్ భద్రతను కూడా కేంద్రం కల్పించింది. వీటికితోడు, భీమవరం రావడానికి ఆయన ఒక హెలికాప్టర్‌ను, ఒక ఏసీ రైలు బోగీని బుక్‌చేసి ఉంచుకున్నారు. నిజానికి, ఒక మామూలు ఎంపీకి ఇంత రేంజ్ దేశంలో మరో ఎం.పీకి లేదేమో అనడంలో అతిశయోక్తి లేదు.

ఇంత బిల్డప్ ఉన్నప్పటికీ, ఆయన భీమవరం వెళ్లలేకపోయారు.

మొన్న సోమవారం నాడు భారత ప్రధాని నరేంద్ర మోడీ భీమవరంలో ఆ మహాయోధుడు అల్లూరి సీతారామరాజు కాంశ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు.

దీంతో, తెలుగు పౌరుషం దేశం దృష్టిని ఆకర్షించింది.

ఇప్పుడు భీమవరంలో 30 అడుగుల కాంశ్య విగ్రహం ఏర్పాటు కావడం అనేది ఆ మహనీయుని నిత్యం స్మరించుకోడానికి దోహదపడే ఓ అపురూప ఘటన. ఇంతటి మహత్తరమైన కార్యక్రమానికి నరసాపురం ఎంపీ (భీమవరం, నరసాపురం లోక్‌సభ పరిధిలో ఉంది) రఘు రామకృష్ణ రాజుకు ఏ దశలోనూ ప్రమేయం కల్పించలేదు. చివరకు కార్ పాస్ కూడా జారీ చేయలేదు.

ఎలాగైనా, ఈ కార్యక్రమానికి స్థానిక ఎం.పీ హోదాలో హాజరు కావాలని రఘురామ విశ్వప్రయత్నం చేశారు. ఆయనకు ఓ అయిదు రోజుల పాటు జడ్ ప్లస్ సెక్యూరిటీని కేంద్రం కల్పించింది. హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. ఆయనను అరెస్ట్ చేయొద్దని, ఆయనకు రక్షణ కల్పించాలని... హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆయనకు మద్దతుగా భీమవరంలో కుర్రాళ్ళు కొందరు ఆదివారం ఊరేగింపు చేశారు. రోడ్డు మార్గంలో వెళితే, పోలీసులతో ఇబ్బందులు ఉంటాయేమో అని,హెలికాప్టర్‌లో భీమవరం వెడదామని ప్లాన్ చేశారు. హెలికాప్టర్ ల్యాండ్ అవడానికి అనుమతి లభించలేదు. ఎందుకు లభించలేదో కనుక్కుందామంటే - కలెక్టర్, ఎస్పీ, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు... ఎవరూ ఫోన్ ఎత్తలేదని ఆయన చెప్పారు. ఇక, లాభం లేదు అనుకుని ఓ ఇరవై మంది 'లైక్ మైండెడ్..' మిత్రులతో కలిసి నర్సాపురం ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ నుంచి భీమవరానికి రఘు బయలుదేరారు.



లింగంపల్లి స్టేషన్‌లో రైలెక్కిన రఘు బృందం.. ఓ నలభై నిముషాల్లోనే బేగంపేట స్టేషన్‌లో దిగేసింది. కథ కంచికి.... రఘు బృందం ఇంటికి క్షేమంగా చేరాయి.

సొంత పార్టీకి చెందిన స్థానిక ఎంపీ పట్ల ప్రభుత్వం ఇలా వ్యవహరించడం కరెక్టా, కాదా అన్నది వేరే పాయింట్. భీమవరంలో అల్లూరి విగ్రహావిష్కరణ సభలో 'ఆ ఎం.పి' తన కంటికి కనపడకూడదని జగన్ భావించి ఉంటారు. జగన్‌ను రఘు ఢిల్లీ నుంచి టీవీ మీడియా మాధ్యమాల్లో రోజువారీగా విరుచుకుపడుతున్న తీరుతో, ఆయన ఆ విధంగా భావించడంలో అసహజం ఏమీ కనపడదు. యంత్రాంగం ఆయన భావనను అమలు చేసి చూపించింది.

ప్రధాని కార్యాలయం రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన అతిథుల జాబితాలో సైతం రఘు రామకృష్ణరాజు పేరు లేదు. అంటే... ఆ వేడుకకు మూడు కిలోమీటర్ల చుట్టు పక్కలకు సైతం ఆయన వెళ్లడానికి అవకాశం లేకుండా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకుంది.

ఈ కార్యక్రమంలో వేదికపై జగన్మోహనరెడ్డి అన్నీ తానై వ్యవహరించారు. ఒక రకంగా వన్‌మ్యాన్ షోగా భీమవరం కార్యక్రమం జరిగింది.

ఆయన మొహంలో అంత ఆనందం, అంత చలాకీతనం ఈ మధ్యకాలంలో ఎప్పుడూ కనపడలేదు.

ప్రధాని సైతం జగన్ ప్రభుత్వ ఏర్పాట్లకు ముగ్ధులైనట్టు కనిపించారు.

రఘురామ రాజు భీమవరం రాకుండా నిలువరించడంతో పాటు ప్రధాని పర్యటనను వీలైనంత ఆహ్లాదకరంగా, అసమ్మతి స్వరం అనేది ఎక్కడా వినిపించకుండా నిర్వహించడం మొదలైనవి కూడా ఇందుకు కారణం అయితే అయి ఉండవచ్చు. ప్రధానికి ముఖ్యమంత్రి హోదాలో జగన్ అందించిన స్వాగత సత్కారాలకు బీజేపీ కేంద్ర నాయకత్వం మురిసిపోయింది.

ప్రధానికి స్వాగతం ఎలా పలకాలో ఆంధ్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని చూసి నేర్చుకోమని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీర్‌ను దెప్పి పొడిచారు.

రఘురామ రాజుకు మరో విషయం కూడా స్పష్టమై ఉండాలి. జగన్ ముఖ్యమంత్రిగా కొనసాగినంత కాలం రఘు ఆంధ్రప్రదేశ్ గడ్డపై కాలు పెట్టలేరు. ఎందుకంటే... జగన్‌కు ఆజన్మ బద్ధ విరోధిగా రఘు మారిపోయారు.

చివరికి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ సైతం రఘు స్వయంగా వేయలేరు. ఢిల్లీ నుంచో, హైదరాబాద్ నుంచో వేయాలి. ఇప్పుడు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో కూడా ఓ కేసు రిజిస్టర్ అయింది కనుక, దీని పర్యవసానాలు ఎలా ఉంటాయో తెలియదు. దీని ఫలితంగా, ఆయన ఢిల్లీకే పరిమితం కావలసి రావచ్చు.

అయినప్పటికీ, జగన్‌పై మీడియా పోరాటానికే ఆయన కంకణ బద్ధులై ఉన్నట్టు కనబడుతున్నారు కనుక, దానినే ఆయన కొనసాగిస్తారనడంలో సందేహం లేదు.

ఈ పోరాటం వల్ల ఆయన లోక్‌సభ సభ్యత్వం రద్దు అయితే కాదు. లోక్‌సభలో వైసీపీ గనుక ఏ విషయం మీదనైనా విప్ జారీచేస్తే.. ఆ విప్‌ను ఉల్లంఘించిన సందర్భాలలో మాత్రమే లోక్‌సభ సభ్యత్వం రద్దు చేయవచ్చునని మన రాజ్యాంగం చెబుతున్నది. అందువల్లనే, విజయసాయిరెడ్డితో సహా వైసీపీ నేతలు ఎన్ని ప్రయత్నాలు చేసినా, రఘు సభ్యత్వం రద్దు కాలేదు.

ఈ నేపథ్యంలో తన మీడియా పోరాటాన్ని ఆయన నిరాఘాటంగా కొనసాగిస్తారనడంలో అనుమానం లేదు. జగన్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను కోర్టులలో సైతం ప్రశ్నించే కార్యక్రమం గట్టిగా చేపట్టవచ్చు కూడా. కానీ, వైసీపీ పార్టీ అధికారంలో ఉండగా... రాష్ట్రంలో కాలు పెట్టడం మాత్రం రఘు రామకృష్ణరాజుకు కుదరదు.

***నీతి :***

***ఒక వ్యక్తి కంటే... ఒక వ్యవస్థ, ఒక వ్యవస్థ కంటే ఒక ప్రభుత్వం బలవంతమైనది. మనుషులు కేవలం నిమిత్తమాత్రులు.***

**- భోగాది వేంకట రాయుడు**

# వై.యస్. అంటే ఒక భరోసా..! ఓ నమ్మకం..!!



**ఆయన వైద్యశాస్త్ర పట్టా పుచ్చుకుని, కేవలం ఒక్క రూపాయి తీసుకుని, మనిషి నాడి పట్టుకుని, శారీరక రుగ్మతలను నయంచేసే అందరిలాంటి మామూలు డాక్టర్ కాదు. సామాన్యుని మనసు తెలుసుకుని, పేదవారి కష్టాలు విని, తన చుట్టూ ఉన్నవారి అవసరాలు కని 'నేను విన్నాను... నేను ఉన్నాను' అంటూ భరోసా కల్పించిన అనన్యసామాన్యుడు. ప్రార్థించిన వారికి వరాలు కురిపించిన అభినవ కరుణామయుడు. చేతులెత్తి మొక్కినవారికి అభయహస్తం అందించిన కలియుగ అవతార పురుషుడు. అన్నా... అని పిలిస్తే 'నేనున్నా' అంటూ పలికే జన నాయకుడు, అలుపెరుగని ప్రజా సేవకుడు. ఆయనే దివంగత మహానేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి. ఆయనను చూస్తే నమ్మకం, ఆయనను కలిస్తే ధైర్యం, ఎదుటివారి భుజంపైన ఆయన చెయ్యివేస్తే భరోసా.**

డాక్టర్ వై.యస్. ఇక, మిగిలిన పేరుతో పని లేదు. తెలుగు జాతి ఈ నేల మీద నడయాడుతున్నంత కాలం జనానికి, జగతికి గుర్తుండి పోయే ఆ రెండు అక్షరాలు తలుచుకుంటే... ఇప్పటికీ ఒక ఉద్వేగం. ఓ పులకింత. ఓ సంక్షేమ భావన. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రాన్ని ఆయన పాలించింది కేవలం అయిదు సంవత్సరాలా నాలుగు నెలలే అయినా... ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతి తెలుగు గుండెకీ ఆయన ఓ యాభై సంవత్సరాలు పాలించిన అనుభూతిని మిగిల్చి వెళ్ళారంటే... కాదని చెప్పే సాహసం ఎవరికీ లేదు.

ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారు. ముఖ్యమంత్రి కావాలన్న తన చిరకాల కోరికను సర్వజనామోదంతో సాకారం చేసుకున్నారు. ఢిల్లీ కనుసైగలలో, సీల్డు కవర్ సంప్రదాయంతో నడుస్తుండిన రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీలో తనను తానే ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించుకుని, తన ఛరిష్మాతో ఎన్నికలలో ఘన విజయం సాధించారు. కాంగ్రెస్‌పార్టీ చరిత్రలోనే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఢిల్లీ విమానం ఎక్కిన తొలి ముఖ్యమంత్రిగా చరిత్రకెక్కారు.

ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వేదికపై నుండే రైతులకు 'ఉచిత విద్యుత్తు' ఫైలుపై ఆయన ముఖ్యమంత్రి హోదాలో ఎంతో ఓపికతో, ఓపికను మించిన చిరునవ్వుతో స్వయంగా వారి గోడు వినేవారు. వారి నుండి వినతిపత్రాలను అందుకుని, అధికారులకు ఇచ్చేవారు. ఆయన హైదరాబాద్‌లో ఉంటే... ఈ కార్యక్రమం తప్పకుండా జరగాల్సిందే. తాను ఇంట్లోనుండి కార్యాలయానికి వచ్చే సమయంలోనే... ప్రజల బాధలు, కష్టాలు తెలుసుకుని వారికి పరిష్కారం చూపిన తరువాతే క్యాంపు ఆఫీసులోకి వెళ్ళడం అలవాటుగా, ఆనవాయితీగా కొనసాగేది. తాను ముఖ్యమంత్రి అయిన నాలుగవ రోజు నుండే లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్‌లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి









## ఎంతటి సేవాభిలాషో...
## అంతటి స్నేహాభిలాషి కూడా...

రాజశేఖరరెడ్డికి స్నేహితులంటే ప్రాణం. తనను ఎదుటివారు ఎంత ఇష్టపడతారో.. ఎదుటివారిని ఆయన అంతకంటే ఎక్కువగా ఇష్టపడతారు. తాను ముఖ్యమంత్రి హోదాలో ఉన్నా తన స్నేహితులని, సన్నిహితులని, హితులని మర్చిపోలేదు. ఆయనను ఎవరు ఎప్పుడు కలవాలన్నా కలుసుకోవచ్చు. తన ఆప్తులకు అపాయింట్‌మెంట్ అన్న పదమే ఆయన డిక్షనరీలో లేదు.

ఎదిగే కొద్దీ ఒదిగే తత్వానికి చిరునామా రాజశేఖరరెడ్డి. అంతా తానే అన్న నైజానికి ఆయన వ్యతిరేకి. కలసి ఉంటే కలదు సుఖం... అన్నది ఆయన నినాదం. మనం జనంలో ఉంటేనే... జనం మనతో ఉంటారన్నది ఆయన విధానం. అందుకే ఆయన చివరి శ్వాస వరకు జనంలోనే ఉన్నారు, 'రచ్చబండ' కార్యక్రమం కోసం జనం మధ్యకు వెళ్తూనే పంచభూతాలలో కలిసిపోయారు.

రతనాల సీమ రాయలసీమ నుండి రాజకీయాలు వేదికగా సేవా రంగంలో అడుగుపెట్టిన ఆణిముత్యం రాజశేఖరరెడ్డి. ఆరణాల అచ్చ తెలుగు పంచెకట్టుతో అసలు సిసలైన తెలుగుతనానికి నిలువెత్తు సాక్ష్యంగా రాష్ట్ర రాజకీయాలలో ప్రకాశించిన తెలుగుతేజం డాక్టర్ వై.యస్.ఆర్.

తిరుగుబాటు నేతగా ఖ్యాతి పొంది, అనతికాలంలోనే రాష్ట్రంలోనే తిరుగులేని నాయకుడిగా లక్షలాది మంది అభిమానులను తన సొంతం చేసుకుని 'మానవీయ మహామతి – యువతరం ఆశాజ్యోతి' అని పిలిపించుకున్న ధీరోదాత్తుడు రాజశేఖరరెడ్డి.

శాసనసభ్యుడిగా, మంత్రిగా, పార్లమెంటేరియన్‌గా, ప్రదేశ్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడిగా, ప్రతిపక్ష నాయకుడిగా, సిఎల్పి నాయకుడిగా రాష్ట్రవ్యాప్తంగా చిన్నా, పెద్దా, ఆడా, మగా అన్న తేడాలేకుండా అశేషప్రజాభిమానాన్ని పొందిన అరుదైన లీడర్ వై.యస్.ఆర్. ఆయన నడక, నడత, నడవడిక అన్నింటిలోనూ ప్రత్యేకతే. నిష్కల్మషమైన నవ్వు, నిస్వార్థమైన పిలుపు, నిరాడంబరమైన జీవితం, ఆదర్శవంతమైన ప్రస్థానం భావితరాలకు స్ఫూర్తిదాయకం.

తెలుగు నేలపై పాదయాత్రల పరంపరకి శ్రీకారం చుట్టిన తొలి నాయకుడు డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి. ఉప్పు సత్యాగ్రహం పేరిట మహాత్మా గాంధీ పాదయాత్ర చేస్తే, అదే స్ఫూర్తితో 'ప్రజాప్రస్థానం' పేరుతో తన పాదయాత్రను సాగించారు రాజశేఖరరెడ్డి. రాజకీయాలలో ప్రవేశించిన పాతికేళ్ళ అనంతరం నిర్విరామశ్రమ, నిరంతర పోరాటంతో అనూహ్యమైన విజయాన్ని తన సొంతం చేసుకుని 2004 మేలో పెట్టిన తొలిసంతకం కొన్ని లక్షల మంది రైతన్నల కుటుంబాలలో వెలుగులు నింపింది. పేదవారిని కార్పొరేట్ మెట్లు ఎక్కేలా చేసిన ఆరోగ్యశ్రీ, చికిత్స తరువాత కోలుకునే వరకు సాయం అందించే 'ఆరోగ్య ఆసరా', సామాన్యుడు సైతం అత్యున్నత విద్యనభ్యసించేలా చేసిన 'ఫీజు రీఎంబర్స్‌మెంట్', మహిళల కోసం పావలా వడ్డీ రుణాలు... ఇలా చెప్పుకుంటూపోతే ఆయన చేపట్టిన సంక్షేమపథకాలు దేశంలోని అనేక రాష్ట్రాలకు ఆదర్శమయ్యాయంటే అతిశయోక్తి కాదేమో.

అయిదేళ్ల తన పాలనను 'సంక్షేమం' దిశగా మళ్ళించారు వై.యస్.ఆర్. గ్రామీణ, పట్టణ నిరుపేదల సంతోషానికి ఆయన పెద్దపీట వేశారు. డాక్టర్ వై.యస్ చేపట్టిన సంక్షేమ పథకాలన్నీ ఆయన కీర్తిని అజరామరం చేశాయి. ప్రతి తెలుగింటిలోనూ కొలువైన దైవంగా, ఆయనను ప్రజలు వారి గుండెల్లో పెట్టుకుని పూజించేలా వారి మనసుల్లో సాక్షాత్కరించారు వై.యస్.

అధికారంలోకి రాకముందు గానీ, వచ్చిన తరువాత గానీ, ఆయన ఎప్పుడూ తన ఇంటికి పరిమితం కాలేదు. ప్రజలతో మమేకం కావడానికే తొలి ప్రాధాన్యత ఇచ్చేవారు. క్యాంపు కార్యాలయం నిత్యం సందర్శకులతో కిటకిటలాడుతూ ఉండేది. ప్రతిరోజూ ప్రజల వినతులు స్వీకరించే విధంగా క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక కూడా ప్రజలకు ఆయనను మరింత చేరువ చేసింది. రాష్ట్రం నలుమూలల నుండీ తమ సమస్యలను సీఎంకి విన్నవించుకోడానికి రోజూ వందల మంది వచ్చేవారు.

అనంతరం క్యాంపు కార్యాలయంలో నిత్యం వినతుల స్వీకరణ కోసం శాశ్వత నిర్మాణాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా, అక్కడ తన రాక కోసం నిరీక్షించే వారి కోసం సకల సదుపాయాలు కూడా ఏర్పాటు చేసిన ఘనత రాజశేఖరరెడ్డిది. దేశ చరిత్రలోనే ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టిన తొలి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డే! 'ఆయనకు జనమే ప్రాణం, ఇంట్లో ఉన్నా ఎప్పుడూ జనం గురించే ఆలోచించేవారు. మనల్ని నమ్మి వాళ్ళు అధికారం ఇచ్చారు... వాళ్ళ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి, వాళ్ళ కష్టాలు తీర్చాలి, కన్నీళ్ళు తుడవాలి.' అని పదే పదే చెప్తూ ఉండేవారని వై.యస్. సతీమణి విజయమ్మ పలు సందర్భాల్లో రాజశేఖర్‌రెడ్డి గురించి చెప్పడమే కాకుండా, ఆమె స్వీయ పర్యవేక్షణలో వచ్చిన పుస్తకాలలో కూడా ఈ విషయాన్ని ప్రస్తావించారు.

**2009 సెప్టెంబర్ 2న మృత్యువు ప్రమాదం రూపంలో ఆయనను కబళించకుండా ఉండి వుంటే... రాష్ట్రం విడిపోయి ఉండేది కాదు. టిఆర్ఎస్ అనే పార్టీకి భవిష్యత్తే లేదు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యే అవకాశమే లేదు. కాంగ్రెస్ భూస్థాపితం అయ్యేది కాదు. రాష్ట్రంలో ప్రతిపక్షం అన్న పదమే వినిపించేది కాదు. అందుకే వ్యక్తి గొప్పవాడా.. వ్యవస్థ గొప్పదా...? అంటే, కొన్ని సందర్భాలలో వ్యవస్థలను ప్రభావితం చేయగలిగిన రాజశేఖరరెడ్డి లాంటి వ్యక్తులే గొప్ప అని చెప్పక తప్పదేమో...!**

**జులై 8న ఆ మహానాయకుడి 73వ జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ అక్షరనివాళులర్పిస్తోంది 'లాయర్'.**






Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com